ప్రజాశక్తి
మంగళవారం 13 జూన్ 2023 8 పేజీలు

గుంటూరు పల్నాడు

స్కూల్ బ్యాగుతో ముఖ్యమంత్రి

పుస్తకాలను చదువుతున్న సిఎం

పెదకూరపాడుకు సిఎం వరాలు

- జెవికె కిట్ల పంపిణీ ప్రారంభం
- అభివృద్ధి పథకాలకు శ్రీకారం
- మాదిపాడు-జగ్గయ్యపేట బ్రిడ్జికి శంకుస్థాపన
- పాలిటెక్నిక్ కళాశాల, మోడల్ స్కూలు ప్రారంభం
- విద్యార్థులతో మమేకమైన ముఖ్యమంత్రి

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి/ క్రోసూరు

పెదకూరపాడు నియోజకవర్గానికి సిఎం జగన్ మోహన్‌రెడ్డి పలు వరాలు ప్రకటించారు. రాష్ట్రంలో నాలుగో విడత జగనన్న విద్యాకానుక (జెవికె) కిట్లను పంపిణీని పల్నాడు జిల్లా క్రోసూరులో సిఎం సోమవారం ప్రారంభించారు. విద్యార్థులకు కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో సిఎం మాట్లాడుతూ పలు హామీలు ఇచ్చారు. సభలో స్థానిక ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ప్రస్తావించిన అంశాలకు ఆమోదం తెలిపారు. పులిచింతల ప్రాజెక్టు బ్యాక్ వాటర్ ద్వారా పలు గ్రామాల్లో సాగునీటి సరఫరాకు అవకాశం కల్పిస్తామన్నారు. పులిచింతల ప్రాజెక్టు నిర్మాణం సందర్భంగా ఎమ్మాజిగూడెంలో 124 కుటుంబాలకు పునరావసం పూర్తి చేస్తామన్నారు. తాళ్లచెరువు గ్రామంలో రూ.45 కోట్లతో ఎత్తిపోతల పథకం, మాదిపాడు నుంచి పులిచింతల డ్యామ్ వరకు రూ.3.5 కోట్లతో రోడ్డు నిర్మాణం చేపడతామన్నారు. నియోజకవర్గంలో విద్యుత్ సరఫరా సరిగాలేదని ఇందుకోసం 133 కెవి సబ్‌స్టేషన్ మంజూరు చేయాలని ఎమ్మెల్యే కోరారు. విద్యుత్ సబ్‌స్టేషన్‌కు సంబంధించి సంబంధిత అధికారుల నుంచి నివేదిక కోరతామని, తర్వాత అనుమతిస్తామన్న సిఎం ఇతర అంశాను ఆమోదించారు.

అంతకు ముందు సిఎం క్రోసూరులోని మోడల్ పాఠశాలను ప్రారంభించి విద్యార్థులతో కొద్దిసేపు పలు అంశాలపై చర్చించారు. జెవికె కిట్ల నాణ్యతను పరిశీలించారు. స్కూల్ బ్యాగ్‌లను తగిలించుకుని నడిచారు. పాఠ్య పుస్తకాలను పరిశీలించి విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగారు. డిజిటల్ క్లాసును వీక్షించారు. డిజిటల్ క్లాసు స్క్రీన్‌పై విద్యార్థులకు 'ఆల్‌దిబెస్టు' అని రాసి సంతకం చేశారు. విద్యార్థులతో ఫొటో దిగి ఆశీర్వదించారు. విద్యార్థులు సిఎంతో సెల్ఫీ దిగారు. అనంతరం జరిగిన సభలో ఆయన విద్యార్థులకు జెవికె కిట్లను పంపిణీ చేశారు. పల్నాడు, ఎన్‌టిఆర్ జిల్లాలను అనుసంధానం చేసే విధంగా కృష్ణా నదిపై మాదిపాడు-జగ్గయ్యపేట బ్రిడ్జికి శంకుస్థాపన చేశారు. పాలిటెక్నిక్ కళాశాలను ప్రారంభించారు. అమరావతి-బెల్లంకొండ మార్గంలో డబల్ లైన్ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. సభకు ముందు దాదాపుగంట సేపు విద్యార్థులతో ముచ్చటించారు. మోడల్ స్కూలు తరగతి గదులపరిశీలన, డిజిటల్ క్లాసుల పరిశీలన తరువాత విద్యార్థులకు అందించే కిట్లలో షూస్, ఇతర వస్తువుల నాణ్యత పరిశీలన చేశారు. సభ అనంతరం పెదకూరపాడు, సత్తెనపల్లికి చెందిన 170 మంది కార్యకర్తలు, స్థానిక నాయకులతో కలిసి మాట్లాడారు. గతంలో కంటే ఈసారి చంద్రబాబుపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. 14 ఏళ్లలో ఏమీ చేయకుండా ఇప్పుడు డిక్లరేషన్లు పేరుతో వివిధ తరగతుల

▶ 2లో

డిజిటల్ క్లాస్ రూంపై వివరాలు అడుగుతున్న ముఖ్యమంత్రి జగన్

సిసిఎల్ఎ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కౌలురైతులు, నాయకులు

కౌలురైతుల రక్షణకు సమగ్ర చట్టం తేవాలి

- ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలి
- పాదయాత్రగా సిసిఎల్ఎ కార్యాలయానికి రైతులు

సిసిఎల్ఎ కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

తక్షణమే కౌలు చెల్లించాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబురావు

విజయవాడ సిఆర్‌డిఎ కార్యాయంలో వినతి

2 లో

పటిష్టంగా ఫ్యామిలీ డాక్టర్ విధానం అమలు

వైద్యారోగ్య శాఖాధికారులతో సమీక్షలో గుంటూరు జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు

ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను నిర్దేశిత లక్ష్యాల మేరకు సక్రమంగా అమలు చేయాలని వైద్యారోగ్య శాఖాధికారులను జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడి ఆదేశించారు. వైద్యారోగ్యశాఖ, విద్యాశాఖ, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖపై మండల స్థాయి అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సోమవారం తన క్యాపు కార్యాలయం నుండి సమీక్షించారు. ఫ్యామిటీ డాక్టర్ విధానం క్షేత్రస్థాయిలో సక్రమంగా అమలు చేయాలని, నిర్దేశించిన విధంగా ఫాలోఅప్ ట్రీట్మెంట్‌లు అందించాలని

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

చెప్పారు. సీడీ, ఎన్‌సీడీ సర్వే వెంటనే పూర్తి చేయాలన్నారు. అన్ని పాఠశాలల్లో జగనన్న విద్యా దీవెన కిట్ల పంపిణీని వెంటనే ప్రారంభించాలని, కిట్ల పంపిణీపై వివరాలను ప్రతిరోజూ

▶ 2లో

డోకిపర్రులోని కాలనీలో పరిశీలిస్తున్న మలేరియా అధికారి

ఇంటింటికి తిరిగి రక్త నమూనాల సేకరణ

ప్రజాశక్తి - మేడికొండూరు

మండలంలోని డోకిపర్రు ఎస్సీ కాలనీ అంబేద్కర్ నగర్ లో మలేరియా జ్వరాలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. కాలనీలో ఇప్పటికే పలువురికి మలేరియా పాజిటివ్ కేసులు నిర్ధారణ అయినట్లు వైద్యాధికారులు తెలిపారు. ప్రత్యేక వైద్య శిబిరాన్ని సోమవారం ఏర్పాటు చేసి ఇంటింటికి తిరిగి రక్త నమూనాలు సేకరిస్తున్నారు. జిల్లా మలేరియా అధికారి టిఎంకె సుబ్రాయణం కాలనీలో పరిసరాలను పరిశీలించి వైద్య ఆరోగ్య సిబ్బందికి సూచనలు చేశారు. జ్వరం లక్షణాలు ఉన్న ప్రతి ఒక్కరికి మందులు పంపిణీ చేశారు. గ్రామ పంచాయతి అధికారులు పారిశుధ్య చర్యలు చేపట్టారు. సబ్ యూనిట్ అధికారి ఘంటసాల శ్రీనివాసరావు, ఆరోగ్య పర్యవేక్షణాధికారి ఎడవల్లి శ్రీనివాసరావు మేడికొండూరు సిహెచ్ఓ రామారావు, ఎంపిహెచ్ఎస్ కె. దాసు పాల్గొన్నారు.

శ్మశాన వాటికకు బెంచీలు అందజేత

ప్రజాశక్తి-పొన్నూరురూరల్

రోటరీ క్లబ్ ఆఫ్ పొన్నూరు ఆధ్వర్యంలో దత్తత గ్రామమైన మండల పరిధిలోని మాచవరంలో గ్రామ వికాస్ కార్యక్రమంలో భాగంగా సోమవారం హిందూ శ్మశాన వాటిక లో రూ.30 వేలు విలువ గలిగిన ఆరు బెంచిలను అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో గ్రామ సమగ్ర అబివృద్ధి కోసం తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా రోటరీ గవర్నర్ తాళ్ల రాజశేఖర్ మాట్లాడుతూ గ్రామాలు అభివృద్ధి చెందినప్పుడే ఆ దేశం అభివృద్ధి బాట పడుతుందని అన్నారు. ప్రతి స్కూలులో విద్యార్థులు నేలపై కూర్చొని చదువుకునే పరిస్థితి ఉండకూడదని అన్ని పాఠశాలలకు బెంచిలను అందజేయడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ వికాస్ రీజనల్ చైర్మన్ కొల్లా శ్రీనివాసరావు, పొన్నూరు రోటరీ క్లబ్ అధ్యక్షులు బోడపాటి రామారావు కార్యదర్శి , నన్నపనేని బాలకష్ణ ,పాములపాటి రవీంద్రనాథ్ ,కొత్త మాసు రామకష్ణ, బి వి చౌదరి, రాజేంద్ర చౌదరి, వెలగా వెంకటేశ్వరరావు, రామచంద్రరావు, గ్రామ మాజీ సర్పంచ్ వెలగా సుబ్బారావు గ్రామస్తులు పాల్గొన్నారు.

కృష్ణా నది వద్ద జాగ్రత్తలు

ప్రజాశక్తి - తాడేపల్లి

కృష్ణానది వద్ద వరుస ప్రమాద ఘటనలతో పోలీసులు జాగ్రత్త చర్యలు చేపట్టారు. సోమవారం సీతానగరం కష్ణా నది పుష్కర ఘాట్ల వద్ద పరిస్థితిని సమీక్షించి స్థానికంగా విధులు నిర్వహిస్తున్న స్పెషల్ పోలీసులకు పలు సూచనలు చేశారు. కొత్తవారు ఎవరైనా నది తీరానికి వస్తే హెచ్చరించాలని స్థానిక మత్స్యకారులతో చెప్పారు. ఈత కోసమంటూ ఎలాపడితే అలా నదిలో దిగకుండా ప్రమత్తం చేస్తూ ఇటీవల మత్యువాత పడ్డ యువకుల ఫొటోలతో కూడిన, హెచ్చరిక ఫ్లెక్సీలను పుష్కర ఘాట్ల వద్ద ఏర్పాటు చేశారు.

కొండమోడు - పేరేచర్ల జాతీయ రహదారి

విస్తరణ పనులను త్వరగా పూర్తి చేస్తాం: ఎంపి

- 49 కి.మీ మేరకు 4 వరుసల రహదారి నిర్మాణం
- టెండర్లు ఆహ్వానించిన కేంద్ర ప్రభుత్వం
- రూ.699 కోట్లతో సివిల్ పనుల అభివృద్ధి
- జులై 25 వరకు టెండర్లకు ఆహ్వానం

ప్రజాశక్తి - నరసరావుపేట

ఎంతో ప్రాధాన్యత ఉన్న కొండమోడు - పేరేచర్ల జాతీ య రహదారి (ఎన్ హెచ్ - 167 ఏజి) అభివృద్ధిలో వేగంగా అడుగులు పడుతున్నాయి. మొత్తం 4 వరుసల జాతీయ రహదారిగా విస్తరణకు కేంద్ర ప్రభుత్వం ఇటీవల రూ.1032.52 కోట్లను మంజూరు చేసింది. ఇప్పుడు తాజాగా ఈ రహదారి నిర్మాణంలో మరో అడుగు వేస్తూ టెండర్లకు ఆహ్వానిస్తూ ఉత్తర్వులని కేంద్రం విడుదల చేసింది. ప్రస్తుతం రూ. 699 కోట్లతో సివిల్ పనుల అభివృద్ధికి గాను జులై 25 వరకు టెండర్లను పిలుస్తూ ఉత్త ర్వులను సంబంధిత కేంద్ర మంత్రిత్వ శాఖ విడుదల చేసింది. పల్నాడు ప్రాంతంలో ఈ రహదారి ఎంతో ప్రాధా న్యత సంతరించుకున్న జాతీయ రహదారి కావడం,సుదూర ప్రాంతాలకు కనెక్టివిటీ పెరగడం, ప్రయాణ సమయం తక్కువ అవ్వడంతో పాటు ప్రమాదాలను అరికట్టేందుకు వ్యవసాయ క్షేత్రం అయిన పల్నాడు ఎంతో ఉపయుక్తంగా మారనుంది. ఈ సందర్భంగా నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణ దేవరాయలు మాట్లాడుతూ ఈ రహదారిని అత్యంత త్వరగా పూర్తి చేసి పల్నాడు ప్రజలకు అందించాలన్న సంకల్పంతో పని చేస్తున్నట్లు చెప్పారు. అన్ని విభాగాల అనుమతులు, ప్రక్రియలు పూర్తి చేసి ప్రాజెక్టు నిర్మాణాన్ని త్వరగా పట్టాలెక్కిస్తామని ఎంపి స్పష్టం చేశారు.

కావటి, మద్దాలి వైఖరి సరికాదు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు హిందూకళాశాల కూడలిలో పూలే దంపతుల విగ్రహాల ఏర్పాటుకు స్థలం కేటాయిస్తామని చెప్పి ఇప్పుడు ఈ స్థలాన్ని మాజీ గవర్నర్ రోశయ్య విగ్రహ స్థాపనకు కేటాయిస్తామని మేయర్ కావటి మనోహర్ నాయుడు, ఎమ్మెల్యే మద్దాలి గిరి చెప్పడం విడ్డూరంగాఉందని పూలేదంపతుల విగ్రహ నిర్మాణ కమిటీ నాయకులు పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం కమిటీ నాయకులు మీడియాతో మాట్లాడుతూ మేయర్, ఎమ్మెల్యే గిరి వైఖరి సామాజిక న్యాయస్ఫూర్తికి విరుద్ధంగా ఉందన్నారు. వారు తమ వైఖరిని మార్చుకుని పూలేదంపతుల విగ్రహాల స్థాపనకు కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో కన్వీనర్ వై. కోటేశ్వరరావు, పి.వి.రమణయ్య, ఉగ్గం సాంబశివరావు, బత్తుల వీరాస్వామి, ఒర్సు ప్రేమరాజు, గంటా ప్రభుదాస్, కొల్లూరు నాగేశ్వరరావు, జూపూడి శ్రీనివాసరావు, గంటా ప్రభుదాస్, వి.సాంబయ్య, సిహెచ్ వాసు, కె.జయసుధ తదితరులు పాల్గొన్నారు. పూలే విగ్రహం ఎదుట వారు కొద్దిసేపునిరసన ప్రదర్శన చేశారు.

తక్షణమే రాజధాని అసైన్డ్ రైతుల కౌలు చెల్లించాలి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్ బాబురావు
- విజయవాడ సిఆర్‌డిఎ కమిషనర్‌కు వినతి

ప్రజాశక్తి - తుళ్లూరు

సి ఆర్ డి ఎ అడిషనల్ కమిషనర్ నరసింహం కు వినతి పత్రం ఇస్తున సిహెచ్ బాబురావు తదితరులు

రాజధాని అసైన్ రైతులకు తక్షణమే పెండింగ్ కౌలు చెల్లించాలని సిపిఎం నాయకులు,అసైన్డ్ రైతులు కోరారు. ఈ మేరకు సోమవారం విజయవాడలోని సిఆర్‌డిఎ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. అనంతరం సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సి హెచ్ బాబురావు మాట్లాడుతూ,రాజధాని లోని అసైన్డ్ రైతులకు కౌలు చెల్లించాల్సిన బాధ్యత ముఖ్యమంత్రి కి లేదా?..అని ప్రశ్నించారు. తెల్లారి లేస్తే పేదల ప్రభుత్వమని చెప్పే వైసిపికి రాజధానిలోని పేదలైన అసైన్ రైతులకు రెండు సంవత్సరాల నుండి కౌలు చెల్లించకుండా వాళ్ల కడుపులు కాలుస్తారా?..అని ప్రభుత్వాన్ని నిలదీశారు. సిఐడి కేసుల పేరుతో 3000 మంది అసైన్డ్ రైతులకు కౌలు చెల్లించకపోవడం ఏమిటి?..ఇదేనా పేదలు,దళితులు, గిరిజనులు పట్ల ముఖ్యమంత్రికి ఉన్న ప్రేమని ఎద్దేవా చేశారు.పని చేద్దామన్నా వ్యవసాయ పనులులేక, ప్రభుత్వం చెల్లించాల్సిన కౌలు రాక అసైన్ రైతులు ఏవిధంగా బ్రతుకుతారని, కౌలు వెంటనే చెల్లించాలని సి ఆర్ డి ఎ అడిషనల్ కమిషనర్ కట్టా సింహాచలాన్ని కలిసి అర్జీ అందజేయడం జరిగిందని చెప్పారు. అసైన్డ్ రైతులకు కౌలు చెల్లించకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు.రెండు సంవత్సరాల నుండి రాజధాని అసైన్డ్ రైతులకు కౌలు చెల్లించకుండా ఎప్పుడు అడిగినా పది రోజుల్లో చెల్లిస్తామంటూ ఇప్పటివరకు కాలయాపన చేయడం తప్ప ,ఒక్క అసైన్డ్ రైతుకైనా రాజధానిలో కౌలు చెల్లించారా అని అన్నారు.అసైన్డ్ రైతులు ఏం పాపం చేశారని వారి మీద ప్రభుత్వం, సిఆర్‌డిఏ అధికారులు కక్ష పట్టినట్లుగా వ్యవహరిస్తూ,వారికి కౌలు చెల్లించకుండా ఎందుకు ఇబ్బందులు పెడుతున్నారని ప్రశ్నించారు.అసైన్డ్ రైతుల కౌలు విషయమై సమాధానం చెప్పే వారే లేకుండా పోయారని,సిఐడి కేసుల పేరుతో కౌలు చెల్లించకుండా సంవత్సరాల తరబడి ఆలస్యం చేయటం ఏమాత్రం సరైనది కాదని అన్నారు.ఎవరైనా పొరపాటు చేస్తే వారిపై చర్యలు తీసుకోవాలే తప్ప కౌలు చెల్లించక పోవడం ఏమిటని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ముఖ్యమంత్రి,అధికారులు స్పందించి రాజధాని అసైన్డ్ రైతులకు రెండు సంవత్సరాల కౌలు వెంటనే చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం రవి, డివిజన్ నాయకులు పేరం బాబురావు,పాబత్తుల వెంకటేశ్వరరావు,అసైన్డ్ రైతులు కంతేటి నాగేంద్రం, నేలపాటి పాప, బిరుదు గడ్డ రాజు,కొప్పుల లాజరు, మేరిగ రాజా, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పటిష్టంగా ఫ్యామిలీ డాక్టర్ విధానం అమలు

(మొదటి పేజీ తరువాయి)

మండలాల వారీగా నివేదిక అందించాలని ఆదేశించారు. పాఠశాలలో జగనన్న గోరుముద్ద పథకం రాగి జావా, మధ్యాహ్న భోజనం నిర్దేశిత సమయానికి కచ్చితంగా అందించేలా విద్యాశాఖ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. పాఠశాలలో పెండింగ్‌లో ఉన్న నాడు-నేడు పనులు తక్షణమే పూర్తయ్యేలా ఎంఇవోలు ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బరువు తక్కువ, బలహీనంగా ఉన్న పిల్లలు ప్రతిరోజు వైఎస్సార్ సంపూర్ణ పోషణ ఆహారం తీసుకునేలా సూపర్‌వైజర్లు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో మోహనరావు, డీఎంహెచ్ఓ డాక్టర్ శ్రావణబాబు, జిల్లా విద్యాశాఖ అధికారి పి.శైలజ, ఐసీడీఎస్ పీడీ బి.మనోరంజని పాల్గొన్నారు.

పెదకూరపాడుకు సిఎం వరాలు

(మొదటి పేజీ తరువాయి)

ప్రజలు మోసం చేయడానికి చంద్రబాబు ముందుకు వస్తున్నారని దుయ్యబట్టారు.

విప్లవాత్మక సంస్కరణలు: మంత్రి బొత్స

దేశంలోనే మన రాష్ట్రంలో విద్యా కీలకంగా సంస్కరణలు చేశామని విద్యాశాఖ మంత్రి బొత్స సత్య నారాయణ అన్నారు. ప్రతి విద్యార్థి ఉన్నతస్థాయిలో నిలబడాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రభుత్వ పాఠశాలలో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్‌లో విద్యా బోధన అందిస్తున్నామని అన్నారు.

తుళ్లూరు రోడ్డు వేయలేకపోయారు : ఎమ్మెల్యే శంకరరావు

టిడిపి హయాంలో పెదకూరపాడు నియోజకవర్గం అభివృద్ధికి నోచుకోలేదని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు విమర్శించారు. రాజధాని ఏర్పడిన తరువాత కూడా గత పాలకులు అమరావతి నుంచి తుళ్లూరుకు రోడ్డు వేయలేకపోయారని, వైసిపి అధికారంలోకి వచ్చాకే నియోజకవర్గ అభివృద్ధి సాధ్యమైందని అన్నారు.

పల్నాడుజిల్లాలో 1.80 లక్షలమందికి జెవికె కిట్లు

జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ మాట్లాడుతూ పిల్లలకు మనం ఇచ్చే అస్తి చదువేనన్నారు. మన విద్యార్థులను ప్రపంచ స్థాయిలో నిలిపే విద్య కోసం దేశంలో ఎక్కడా లేని విధంగా అమ్మఒడి, నాడు - నేడు, వైఎస్సార్ సంపూర్ణ పోషణ, బైలింగ్వల్ పుస్తకాలు, ఇంటరాక్టివ్ విధానంలో ఇంగ్లీషు పాఠాలు, డిజిటల్ క్లాసులు వంటి అనేక కార్యక్రమాలు ప్రభుత్వం చేపడుతోందన్నారు. పల్నాడు జిల్లాలో 1,80,079 మంది విద్యార్థులకు రూ.45.02 కోట్లతో విద్యాకానుక కిట్లను పాఠశాల తెరిచిన మొదటి రోజే అందించబోతున్నామన్నారు. సభలో మంత్రులు బొత్సా సత్యనారాయణ, కారుమూరి నాగేశ్వరరావు, అంబటి రాంబాబు, విడదల రజిని, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్, విద్యాశాఖ కమిషనర్ సురేష్ కుమార్, ఎంపీలు మోపిదేవి వెంకటరమణ, అయోధ్య రామిరెడ్డి, లావు శ్రీకృష్ణ దేవరాయులు, ఎమ్మెల్సీలు చంద్రగిరి ఏసురత్నం, ఎల్.అప్పిరెడ్డి, తలశిల రఘురాం, జంగా కృష్ణమూర్తి, ఎమ్మె ల్యేలు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, కాసు మహేష్‌రెడ్డి, బొల్లా బ్రహ్మనాయుడు, గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-గుంటూరు

ప్రపంచ బాల కార్మికుల నిర్మూలనా దినోత్స్వమును పురస్కరించుకొని సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం నుండి హిందూ కాలేజి సెంటర్ వరకూ బాల కార్మికుల నిర్మూలనపై అవగాహన కల్పించుటకు నిర్వహించాన ర్యాలీని జిల్లా సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి జెండా ఊపి ప్రారంభించారు. జూన్ 1 నుండి 30వ తేదీ వరకూ జిల్లాలో బాల కార్మికుల నిర్మూలనకు నిర్వహించే ప్రత్యక డ్రైవ్‌లో భాగంగా ఈ ర్యాలీని నిర్వహించినట్లు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి బి. మనోరంజని తెలిపారు. ర్యాలీలో బాల కార్మిక వ్యవస్థకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో డిఆర్ఒ కె.చంద్రశేఖరరావు, చెల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ జి ప్రమీలా, సభ్యులు రాజకుమారి, దుర్గాభవానీ, డీఎంహెచ్ఓ డాక్టర్ శ్రావణబాబు, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతి, స్టెప్ సీఈఓ పల్లవి, డీసీఎల్ శివప్రసాద్, ఆర్డీఓ ప్రభాకర్ రెడ్డి, డీపీఓ కేశవరెడ్డి, క్రాఫ్ ఎన్జీవో ప్రతినిధి ఫ్రాన్సిస్, లైన్ డిపార్టుమెంట్లు నుండి స్టేక్ హెూల్డర్స్, లేబర్ డిపార్టుమెంటు సిబ్బంది పాల్గొన్నారు.

తుళ్లూరు: బాల కార్మిక వ్యవస్థకు ప్రధాన కారణం పేదరికమే నని వక్తలు పేర్కొన్నారు.కొంతమంది చిన్నారులు తప్పక పని చేయాల్సిన పరిస్థితులు ఉన్నాయని,వారు పని చేస్తేనే తిండి తినగలిగే దీనావస్థలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ప్రపంచ బాలకార్మిక వ్యతిరేక దినోత్స వం సందర్భంగా మంగళగిరి గుడ్ షెపర్డ్ కాన్వెంట్ అధ్వర్యంలో ఎంపిడిఒ కార్యాలయం సమావేశం హాలులో అవగాహనా సదస్సు నిర్వహించారు. ఎంపిడిఒ బి.శివన్నారా యణ మాట్లా డుతూ, గ్రామీణ ప్రాంతాల్లో కుటుంబం గడ వడం కోసం పిల్లల్ని పనుల్లోకి పంపడం జరుగుతోందని, ఇందుకు కుటుంబ ఆదాయాలు పెరగక పోవడం, పేదరి కమే కారణ మన్నారు. పేదరికం నిర్మూలనకు ప్రభుత్వం చేస్తున్న కృషితో పాటు స్వచ్ఛంద సంస్థల సహకారం అవసరం ఉందన్నారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూ లనకు, బాలలు,మహిళల హక్కులు,రక్షణ తదితర అం శాలపై అవగాహన కల్పిస్తున్న గుడ్ షెఫర్డ్ కాన్వెంట్ నిర్వా హకు లను అభినందించారు. ఎపిఎం చిన వీరయ్య మాట్లా డుతూ, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు నిరంతరం పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. శ్రీ నిధి బ్యాంక్ డిజిఎం ఎం.హృదయ రాజు మాట్లాడుతూ, పేదరిక నిర్మూల నకు విద్య దోహద పడు తుందని, తద్వారా బాల కార్మిక వ్యవ స్థను నిర్మూలిం చేందుకు అవకాశం ఉంటుందన్నారు. గుడ్ షెఫర్డ్ కాన్వెంట్ సిస్టర్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆఫ్ హ్యూమన్ రైట్స్ ప్రతినిధి లత మాట్లాడుతూ,బాల కార్మికులను గుర్తించేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని,బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై తల్లిదండ్రులకు అవ గాహన కల్పిం చడం అవసర మన్నారు. అనంతరం వాల్‌పోస్టర్‌ను ఆవి ష్కరించారు. కార్యక్రమంలో ఈవోఆర్ డి.నాగానంద్,ఎస్ఐ రాంబాబు, మారుతి మహిళా సొసైటీ డైరెక్టర్ బి.గిరిజా, అంగన్వాడీ సూపర్‌వైజర్ సునీత, కార్ప్ సంస్థ సెక్రెటరి డి.పోతురాజు పాల్గొన్నారు. **చేబ్రోలు:** మండలంలోని శేకూరులో చైల్డ్ రైట్స్ అడ్వొకెసి ఫౌండేషన్-క్రాఫ్ ఆధ్వ ర్యంలో బాల కార్మికుల వ్యతిరేక దినోత్సవం నిర్వహిం చారు. 'బాలలందరికి సామాజిక న్యాయం, బాల కార్మిక వ్యవస్థను అంతం చేయండి' అనే నినాదంతో గ్రామంలో ర్యాలీగా తిరిగి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా క్రాఫ్ జిల్లా కోఆర్డినేటర్ జి.వెంకయ్య,శేకూరు గ్రామ హై స్కూల్ ప్రధానో పాధ్యాయులు కెయస్ ప్రసాద్ మాట్లాడారు.

ర్యాలీని ప్రారంభిస్తున్న గుంటూరు జెసి రాజకుమారి

శేకూరులో ..

తుళ్లూరులో ..

నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్ , జడ్పీ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా

వృద్ధురాలు ఆనందమ్మ మృతదేహానికి నివాళి

ప్రజాశక్తి-తెనాలి

రూరల్ గ్రామం కొలకలూరుకు చెందిన వృద్ధురాలు ఉన్నం ఆనందమ్మ(99) ఆదివారం రాత్రి మృతి చెందారు. ఆనందమ్మ కుమారుడు ఉన్నం యెహెస్కేలు ప్రస్తుతం కర్నూలు డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ గా పని చేస్తున్నారు. కోడలు ఉన్నం షకీల కొలకలూరు సర్పంచిగా గతంలో పనిచేశారు. కొలకలూరు స్వగృహంలో ఆనందమ్మ మృతదేహానికి సోమవారం జిల్లా పరిషత్ చైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనా, ఎమ్మెల్యే అన్నా బత్తుని శివకుమార్ నివాళు లర్పించారు. ఆమె భూస్థాపన కార్యక్రమం సోమవారం సాయంత్రం ముగిసింది.

అక్రమ మట్టితవ్వకాలను ప్రశ్నిస్తే దాడి చేస్తారా?

నిందితులను అరెస్ట్ చేసే వరకూ పోరాడతామన్న టిడిపి, ఎమ్మార్పీఎస్

ప్రజాశక్తి-తెనాలి

అక్రమ మట్టి తవ్వకాలను ప్రశ్నించిన మాజీ సర్పంచ్, టిడిపి దళిత నాయకుడిపై అధికార వైసిపి నాయకులు చేసిన దాడిపై టిడిపి, దళిత సంఘాలు ధ్వజమెత్తాయి. దాడిలో గాయపడి తెనాలి జిల్లా వైద్యశాల్లో చికిత్స పొందుతున్న వేమూరి మోహనరావును టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి పిల్లి మాణిక్యరావు, ఎమ్మార్పీఎస్ నాయ కులు సోమవారం పరామర్శించారు. దీనిపై మాణిక్యరావు మాట్లాడుతూ అక్రమాలపై ప్రశ్నిస్తే దాడు లకు పాల్పడటం, బెదిరించటం వైసిపి పాలనలో సర్వసాధారణమైందన్నారు. కొల్లిపర మండలంలో ఆదివారం జరిగిన ఘటనపై పోలీసుల స్పందన దారుణంగా ఉందన్నారు. మోహనరావును కులం పేరుతో దూషించి దాడికి పాల్పడిన వారిని అరెస్ట్ చేయకపోవగా, వారితో కౌంటర్ కేసులు పెట్టే ప్రయత్నం చేస్తున్నారని, దీనికి భయపడే ప్రసక్తే లేదన్నారు. దాడికి పాల్పడిన వైసిపి నాయకులు ఎ.చంద్రారెడ్డి కుమారుడు అరుణ్‌రెడ్డిని తక్షణమే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో కొల్లిపర పోలీస్ స్టేషన్ ముట్టడిస్తామని హెచ్చరించారు. ఎమ్మార్పీఎస్ నాయకులు సత్యం మాదిగ మాట్లాడుతూ ఇది యావత్ దళితజాతిపై జరిగిన దాడిగా భావిస్తున్నామని, తక్షణమే నిందితులను అరెస్ట్ చేయాలని, లేని పక్షంలో ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షులు కృష్ణమాదిగ నేతృత్వంలో ఉద్య మం ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో అత్తోట శరత్‌బాబు, నలుకుర్తి రమేష్, శాఖమూరి చిన్నా, కె.ఏడుకొండలు, అరుణకుమారి తది తరులు పాల్గొన్నారు.

మోహనరావును పరామర్శిస్తున్న టిడిపి, ఎమ్మార్పీఎస్ నాయకులు

మిర్చి నిల్వలు

		బ్యాగులు
మిర్చి దిగుమతి	:	29,701
మిర్చి ఎగుమతి	:	25,059
మిర్చి నిల్వ	:	4,642

మిర్చి ధరలు

	రూపాయలలో
334	9,000 - 23,000
నెం.5	12,000 - 17,000
273	14,500 - 22,500
341	10,000 - 20,000
4884	11,800 - 11,800
సూపర్ 10	21,000 - 21,500
నాన్ ఎసి	
తేజ	9, 500 - 24,000
బడిగె	11, 800 - 21,500
దేవనూరు డీలక్స్	10,000 - 18,000
తాలుకాయలు	5,000 - 14,000
ఎసి	
334	21,000 - 21,000
341	24,000 - 24,000
4884	9,600 - 10,700
తేజ	15,500 - 24,000
బడిగె	22,000 - 22,000
తాలుకాయలు	9,000 - 13,000

ఈదురు గాలులకు రూ.40 లక్షల నష్టం

విద్యుత్ పునరుద్ధరణ చర్యలు పూర్తి

ప్రజాశక్తి-తెనాలి

ఈ నెల 9, 10 తేదీల్లో వీచిన ఈదురు గాలులకు విద్యుత్ శాఖకు దాదాపు రూ.40 లక్షల మేర నష్టం వాటిల్లిందని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వివి చిరంజీవి సోమవారం తెలిపారు. తన పరిధి లోని తెనాలి, వేమూరు, కొల్లూరు, భట్టిప్రోలు, రేపల్లె అర్బన్, రూరల్ ప్రాంతాలలో వరుసగా రెండు రోజులు వీచిన బలమైన గాలులకు దాదాపు 140 విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయన్నారు. అలాగే కొన్నిచోట్ల పెద్ద పెద్ద చెట్లు విద్యుత్ వైర్లపై పడ్డాయన్నారు. ముఖ్యంగా 33 కెవి, 11 కెవి లైన్లో పరిధిలో స్తంభాలు, వైర్లు బాగా దెబ్బతిన్నాయన్నారు. వెంటనే స్పందించి 120 మంది విద్యుత్ సిబ్బంది, వారికి అదనంగా మరో 60 మంది కాంట్రాక్ట్ సిబ్బందితో 24 గంటలలో విద్యుత్ మరమ్మతులు పూర్తి చేశామని చెప్పారు. ఇంకా ఎక్కడైనా మరమ్మతులు ఉన్నట్లయితే అధికారులకు సమాచారం ఇస్తే వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు.

విద్యుత్ లైన్ల మరమ్మతులలో సిబ్బంది

ఐటిఐ ప్రవేశాలకు 16న అడ్మిషన్ కౌన్సిలింగ్

ప్రజాశక్తి-తెనాలి

జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటిఐ కళా శాలల్లో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 16న అడ్మిషన్ కౌన్సిలింగ్ తెనాలి ప్రభుత్వ ఐటిఐ కళా శాలలో జరుగుతుందని ప్రిన్సిపల్ ఎ.శ్రీదేవి సోమవారం తెలిపారు. 16న ఉదయం 1 నుంచి 100 వరకూ గల మెరి ట్ నెంబర్లకు, అలాగే మధ్యాహ్నం రెండు గంటల నుంచి 101 నుంచి 198 వరకూ గల మెరిట్ నెంబర్లకు కౌన్సిలింగ్ జరుగు తుందన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికేట్లతో మెరిట్ నెంబర్ ఆధారంగా కౌన్సి లింగ్‌కు హాజరు కావాలని కోరారు. వివరాలకు 8886856262, 9347795839 నెంబర్లలో సంప్రదించాల్సిం దిగా కోరారు.

విద్యార్థులు ప్రభుత్వ పథకాలను ఉపయోగించుకోవాలి

ప్రజాశక్తి-పెదనందిపాడు రూరల్

ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు ఉచిత పథకాలతో పాటు అనుభవం గల ఉపాధ్యాయులతో ఉత్తమైన విద్య బోధిస్తున్నారని పెదనందిపాడు ఎంపిపి హెప్సీబా అన్నారు. సోమవారం పాఠశాలలో విద్యార్థులకు జెవికె కిట్స్ ను వారు అందజేశారు విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలన్నారు ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయిని లక్ష్మీ దుర్గ అధ్యక్షత వహించగా కార్యక్రమంలో ఎంఇఒ బాలసుబ్రమణ్యం, ఉప ఎంపిపి ఖాసీంబి. సర్పంచ్ పద్మారావు, దివి రాంబాబు పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE ADDL SENIOR CUVIL JUDGE NARASARAOPET.
CREDITORS INSOLVENCY PETITION NO:36/23.

Between:-
దొడ్డి శ్రీనివాసరావు ... పిటిషనర్.
V/S
1) అచ్చి రవి.
2) ఓర్చు అంకమ్మరావు ...రెస్పాండెంట్స్.

పై నెంబర్ గల ఐ.పి దావాలో పిటిషనర్ ఇందలి రెస్పాండెంట్స్‌పై CREDITOR I.P దాఖలు చేసి సదరు పిటిషనర్ తనకు రావాల్సిన బాకీ 1వ ప్రతివాది నుండి రాబట్టుటకు దావా దాఖలు చేసి ఉన్నారు. సదరు ఐ.పి లో ఎవరికైనా ఆక్షేపణలు ఉన్న యెడల శ్రీ పై కోర్టు వారి ఎదుట ది. 21-06-2023 న ఉదయం 10:30 లకు మీరు స్వయంగా కానీ న్యాయవాది గారి ద్వారా కానీ హాజరై మీకు గల ఆక్షేపణలు తెలియపరచుకోగలరు. లేని యెడల మీ పరోక్షమందు తీర్మానించబడునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

కోర్టు వారి ఉత్తర్వులతో

వాయిదా ది.21-06-2023.

ఇట్లు.
గుండాల సురేష్ బాబు,
న్యాయవాది
నరసరావుపేట, పల్నాడు జిల్లా.
Cell.No.9985519853, 8328442282.

Notice
IN THE COURT OF THE HON'BLE PRL.SENIOR CIVIL JUDGE::GUNTUR
I.A. No:561 /2021 in O.S.No: 265 /2016

Between:
Yerram Venkayamma & Another
.....Petitioners/Plaintiffs
And
Smt.Bolla Bhulakshmi and Others
....Respondents/Defendants

To,
R-2/D-2: Velaga Venkateswarlu,
S/o.Nageswara Rao, R/o.Door No:5-69-23,
6/20 lane, Brodipet, Guntur.
(Proposed R2/D2)

పై నెంబరు దావాలోని I.A. No:561/2021 పిటీషనులో 2వ రెస్పాండెంట్/ ప్రతివాది అయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారా నోటీసులు పంపించినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారు మీకు Subsituted Service ద్వారా పేపరులో ప్రకటన ద్వారా తెలియపరచమని ఆర్డరు వేయగా, సదరు ఆర్డరు ప్రకారము మీరు ది:22-06-2023న ఉ. గం.10-30 ని.లకు పై తెలిపిన కోర్టునకు మీరు స్వయంగా కాని, మీ అడ్వకేటు ద్వారా గాని హాజరు అయి మీ ఆక్షేపణలు తెలియపరచుకొన వలయును. లేనియెడల మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడునని తెలియపర్చడమైనది.

(శ్రీ కోర్టు వారి అనుమతితో)

వాయిదా తేది:22-06-2023

చాగంటి నరసింహా రెడ్డి,
పిటీషనర్లు/ వాదుల తరపు అడ్వకేట్,
గుంటూరు.

మాట్లాడుతున్న డాక్టర్ జగన్మోహన్‌రెడ్డి తదితరులు

రేపు రెడ్‌క్రాస్ రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - నరసరావుపేట

ప్రపంచ రక్త దాతల దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో ఎస్పీ రవిశంకర్‌రెడ్డి సారధ్యంలో రక్తదాన శిబిరాన్ని బుధవారం నిర్వహించనున్నట్లు పల్నాడు జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ కంజుల జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రెడ్‌క్రాస్ స్థాపించినప్పుడు ప్రపంచ యుద్ధంలో గాయపడిన క్షతగాత్రులకు రక్తదానం ద్వారా బతుకుతారని తెలియజేసి రక్తదానంపై అవగాహన కల్పించి బ్లడ్ బ్యాంకును రెడ్‌క్రాస్ సంస్థను స్థాపించినట్లు చెప్పారు. అప్పటి నుండి రెడ్‌క్రాస్‌కు బ్లడ్ బ్యాంకుకు అవినాభావ సంబంధం ఉందన్నారు. ఆస్ట్రియా దేశస్థుడైన ల్యాండ్ స్టైనర్ 1845లో రక్తాన్ని ట్రాన్స్‌మిషన్ చేయొచ్చని తెలిపారని, ఆయన జయంతి అయిన జూన్ 14ను ప్రపంచ రక్త దాతల దినోత్సవంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు రక్తదానం చేయాలని కోరారు.

కౌలురైతులకు భూయజమానులు సహకరించాలి

ప్రజాశక్తి-ఈపూరు

కౌలు రైతులు గుర్తింపు కార్డులు పొందడం ద్వారా ప్రభుత్వం ద్వారా అనేక ప్రయోజనాలు చేకూరుతాయని ఏఈఓ అప్పారావు అన్నారు. మండలంలోని బొమ్మరాజు పల్లి, ఇనిమెళ్ల గ్రామాల్లో నిర్వహించిన అవగాహన సదస్సుల్లో ఆయన మాట్లాడుతూ భూయజమానులు కౌలు రైతులకు సహకరించటం వలన వచ్చే నష్టమేమీ ఉండదన్నారు.

కౌలు రైతుకు పంటల బీమా, పంట రుణం, సబ్సిడీపై విత్తనాలు, ఎరువులు, ఏదైనా విపత్తుల్లో పంట నష్టపరిహారం పొందవచ్చని చెప్పారు. ఖరీఫ్ ప్రారంభమైన క్రమంలో రైతు భరోసా కేంద్రాల్లో 50 శాతం రాయితీతో పచ్చిరొట్ట విత్తనాలు పొందాలని, వాటిని పొలంలో పెంచి కలియ దున్నడం ద్వారా భూసారం పెంచుకోవచ్చని వివరించారు. వంట సాగు చేసే ప్రతి రైతు ఈ క్రాప్ నమోదు చేసుకోవాలన్నారు. షాపుల్లో విత్తనాలు కొనుగోలు చేసే రైతులు రసీదులను తప్పనిసరిగా తీసుకోవాలని, వాటిని పంటకాలం ముగిసే వరకు దాచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు ఎస్‌కె యు సల్మా, ఏలియా, రైతులు పాల్గొన్నారు.

ఎన్ఎస్‌పి ఇఇగా మురళీధర్

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

నాగార్జున సాగర్ ప్రాజెక్టు సాగునీటి పారుదల సత్తెనపల్లి డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా ఎం.మురళీధర్ నియమితులయ్యారు. పల్నాడు జిల్లా నీటిపారుదల శాఖ కార్యాలయంలో మానిటరింగ్ ఈఈగా పనిచేస్తున్న మురళీధర్ సత్తెనపల్లి డివిజన్‌కు బదిలీ అవగా సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన్ను ఏపి వర్క్ చార్జ్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపి సత్కరించారు. సత్తెనపల్లి డివిజన్ అధ్యక్షులు ఎం.మరియదాసు, కోశాధికారి బ్రహ్మానందం, జె.నాగేశ్వరరావు, బి.మేరీ, కె.అబ్రహాం, సిహెచ్ ప్రకాష్‌బాబు, షేక్ ఆలిస్ సైదా, సిహెచ్ జెర్సీ పాల్గొన్నారు.

పదవులు అమ్ముకుంటున్న ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు

- ఈసారి ఆయనకు టిక్కెట్ ఇస్తే ఓటమే
- జగన్‌ను కలిసి విన్నవిస్తాం
- ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా పలువురు వైసిపి నాయకుల సమావేశం

ప్రజాశక్తి - వినుకొండ

సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడుకు వ్యతిరేకంగా వైసిపికి చెందిన పలువురు నాయకులు విమర్శలు గుప్పించారు. నూజెండ్ల మండలం జంగాలపల్లిలో సమావేశమైన వీరు ఎమ్మెల్యేపై తీవ్ర ఆరోపణలు చేశారు. జగనన్న కోసం పని చేసిన తాము ఆర్థికంగా నష్టపోయామని, తమను ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదని అన్నారు. ఎమ్మెల్యే తీరువల్ల ఈసారి ఆయన గెలవరని, అభ్యర్థిగా కొత్తవారిని తెచ్చుకోవాలని అన్నారు. ఇదే విషయాన్ని సజ్జల రామకృష్ణారెడ్డి దృష్టికి తీసుకెళ్లామని, సిఎం జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి విన్నవిస్తామని చెప్పారు. సమావేశంలో చింత ఆదిరెడ్డి, నక్క వెంకట్రెడ్డి, భూక్య రాంజీ నాయక్, కోట నాయక్, కృష్ణారెడ్డి, వజ్రాల రాఘవరెడ్డి, జనార్ధనరెడ్డి, దావులూరి వీరాంజనేయులు, రాంజీ నాయక్, శ్రీను నాయక్, మంత్రు నాయక్, తిరుపతయ్య యాదవ్, తోమాటి పేరయ్య పాల్గొన్నారు. బ్రహ్మనాయుడు గెలుపు కోసం తామెంతో ఖర్చు పెట్టామని, ఒక గిరిజన నిరుద్యోగికి సబ్ స్టేషన్‌లో షిఫ్ట్ ఆపరేటర్ ఉద్యోగం ఇవ్వాలని కోరితే ఇప్పించకుండా దాన్ని చిలకలూరిపేటకు చెందిన వ్యక్తికి రూ.1.50 లక్షలకు అమ్ముకున్నారని మూడవ కోటానాయక్ ఆరోపించారు. పోలీసులతో తమపై దౌర్జన్యం చేయించారని కోటప్ప నగర్‌కు చెందిన సీనియర్ నాయకులు వెంకటరెడ్డి ఆరోపించారు. గ్రామంలో రెండు గ్రూపులను తయారు చేసి పార్టీని విచ్ఛిన్నం చేస్తున్నారని బొల్లాపల్లి మాజీ ఎంపిటిసి భుక్య రాంజీనాయక్ అన్నారు. కార్యకర్తలను చీదరించుకుంటున్నారని, ఇదేమని ప్రశ్నిస్తే బెదిరిస్తున్నారని ఏనుగుపాలేనికి చెందిన దావులూరి వీరాంజనేయులు అన్నారు. పార్టీకి చెందిన అనేకమంది నాయకులు... రూ.50 లక్షలకు పదవులు కొనుక్కున్నామని, ఆ డబ్బు సంపాదన కోసం ఇసుక మట్టి మద్యం బియ్యం లాంటి మాఫియాలు చేస్తున్నామని కొందరు చెబుతున్నారని చక్రాయపాలెం నాయకులు కోటానాయక్ విమర్శించారు. ఇదిలా ఉండగా ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు తీరుపై పలువురు సీనియర్ నాయకులు అసంతృప్తిగా ఉన్నారు. మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు సైతం ఎమ్మెల్యేతో ఎడమొహం పెడమొహంగా ఉంటున్నారు. నాలుగేళ్లుగా వీరిద్దరూ కలిసి పని చేసిన దాఖలాలు లేవు. ప్రభుత్వ కార్యక్రమాలకు ఆయన్ను పిలవడం లేదని సమాచారం. వీరిద్దరి మధ్య సోషల్ మీడియా, ఫ్లెక్సీల విషయంలోనూ వివాదం నడిచింది.

సిఎం సభకు బస్సులు.. ప్రయాణికులకు ఇబ్బందులు

ప్రజాశక్తి - వినుకొండ

పెదకూరపాడు నియోజకవర్గంలోని క్రోసూరులో సోమవారం జరిగిన సీఎం సభకు వినుకొండ డిపో నుండి ఆర్టీసీ బస్సులను పంపారు. దీంతో వినుకొండ నుండి విజయవాడ, గుంటూరు, నరసరావుపేట, ఒంగోలు, ఎర్రగొండపాలెం, మార్కాపురం, కారంపూడి తదితర ప్రాంతాలతో పాటు నియోజకవర్గంలోని మారుమూల గ్రామాలకు వెళ్లేందుకు ప్రయాణికులు బస్సులు లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆదివారం సాయంత్రం వినుకొండ డిపో నుంచి 30 ఆర్టీసీ బస్సులకు పైగా పెదకూరపాడు ప్రాంతాలకు పంపడంతో రాత్రి నుండే ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు. వివిధ ప్రాంతాలకు వెళ్లేందుకు బస్టాండ్‌కు వచ్చిన వారు గంటల తరబడి బస్సులు రాకపోవడంతో తీవ్ర అసహనానికి గురయ్యారు. ప్రచార కేంద్రంలోని ఆర్టీసీ ఉద్యోగులను ప్రశ్నించడంతో పలు సందర్భాల్లో స్వల్ప వాగ్వాదాలు తలెత్తాయి. సీఎం సభకు బస్సులు పంపడం జరిగిందని రెండు రోజులు సమయానికి బస్సులు రావని ప్రయాణికులకు సిబ్బంది తెలిపారు. ఆర్టీసీ బస్సులు లేక ప్రయాణికులు ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తూ అగచాట్లు పడి వారి వారి గమ్యస్థానాలకు చేరేందుకు వెళ్లారు.

డాక్టర్ కెఎస్‌పిఆర్ కాలేజి ప్రిన్సిపాల్ మంగేశ్వరికి డాక్టరేట్

ప్రజాశక్తి - నరసరావుపేట

స్థానిక కేసనపల్లిలోని డాక్టర్ కెఎస్‌పిఆర్ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపల్‌గా వ్యవహరిస్తున్న మంగేశ్వరి జుజ్జూరికి ఆచార్య నాగార్జున యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. 'సెకండరీ స్కూల్ విద్యార్థుల గణితంలో ఆసక్తి, వైఖరి - అకడమిక్ అచీవ్‌మెంట్ అంశంపై చేసిన పరిశోధనకు డాక్టరేట్ పొందినట్లు కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ మేదరమెట్ల రామ శేషగిరిరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగేశ్వరికి గైడ్‌గా సెయింట్ కాలేజీ ఆఫ్ ఎడ్యుకేషన్ ఫర్ ఉమెన్ గుంటూరుకు చెందిన అసోసియేసట్ ప్రొఫెసర్ డాక్టర్ బి.శ్రీలత వ్యవహరించారు. మంగేశ్వరికి కాలేజీ యాజమాన్యం, అధ్యాపకులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

మంగేశ్వరికి శుభాకాంక్షలు తెలియజేస్తున్న రామనాగేశ్వరరావు తదితరులు

గృహ నిర్మాణం విషయంలో మాట తప్పిన ప్రభుత్వం : సిపిఎం

ప్రజాశక్తి - చిలకలూరిపేట

జగనన్న గృహ నిర్మాణం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అనే సామెతలా ఉందని సిపిఎం పట్టణ కార్యదర్శి పి.వెంకటేశ్వర్లు విమర్శించారు. ఈ మేరకు స్థానిక సిపిఎం కార్యాలయంలో సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ప్రభుత్వానికి ఏడాది సమయం ఉందని, ఇప్పటికీ పట్టణంలో 25 శాతమే ఇళ్ల నిర్మాణాలు పూర్తవగా గుదేవారిపాలెంవద్ద ఒకటి రెండు ఇళ్లు మాత్రమే కట్టారని, గ్రామాల్లో ఇంకా ప్రారంభం కాలేదని చెప్పారు. ఇది పేదలకు ఉచితంగా ఇళ్లు నిర్మించి ఇస్తామనే వాగ్దానాన్ని వమ్ము చేయడమేనని విమర్శించారు. ఒక్క రూపాయితోనే పట్టాలను రిజిస్ట్రేషన్ చేసి ఇస్తామని చెప్పి మాట తప్పారన్నారు. ఇళ్లు మంజూరైనా అవి నిర్మాణం పూర్తవక అనేక మంది లబ్ధిదార్లు అద్దె ఇళ్లల్లో ఉంటున్నారని, ప్రభుత్వం చెబుతున్న విధంగా రూ.1.80 లక్షలతో ఇల్లు నిర్మిస్తే అది కూలిపోవడం మినహా నివాసం ఉండడానికి పనికి రావాలని అన్నారు. ఇప్పటికైనా గృహ నిర్మాణ నిపుణులతో ప్రభుత్వం పరిశీలన చేయించి పటిష్టంగా ఇళ్ల నిర్మాణం చేపట్టాలని, అందుకుగాను ఒక్కో ఇంటి నిర్మాణానికి ఇచ్చే మొత్తాన్ని రూ.5 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. జగనన్న కాలనీల్లో మౌలిక వసతులు ఇంకా కల్పించలేదని, సత్వరమే ఆ పనులు పూర్తి చేయాలని కోరారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పోలీసులు, గుడ్ షెపర్డ్ నిర్వాహకులు

బాలల్ని పనిలో పెట్టుకోవద్దు

ప్రజాశక్తి - అమరావతి

ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద వాల్‌పోస్టర్‌ను ఎస్‌ఐ నాగేంద్రరావు, ఎస్ఐ వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు. గుడ్ షెపర్డ్ సిస్టర్స్ అమరావతి ఆధ్వర్యంలో జూన్ 30వ తేదీ వరకూ పిల్లల్ని బడిలో చేర్పించే కార్యక్రమం చేపట్టడాన్ని వారు అభినందించారు. బాలలతో పనులు చేయించొద్దని, చదువుకోనివ్వాలని కోరారు. బాలలతో పని చేయించడం నేరమని సమాచారం తెలిసిన వారు టోల్‌ఫ్రీ నంబర్‌కు 1098 సంప్రదించి వివరాలు తెలపాలని కోరారు. తల్లిదండ్రులు సైతం వారి పిల్లల్ని చదువుకోవడానికి ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో సిస్టర్ విన్నరసి, సిస్టర్ డియానా, పోలీస్‌సిబ్బంది లక్ష్మణ్, పవన్ పాల్గొన్నారు.

కౌలురైతు పాదయాత్రకు ఘన స్వాగతం

సిసిఎల్ఎ కార్యాలయం వద్ద ధర్నా - వినతి - కౌలు రైతుల సమస్యలను తక్షణం పరిష్కరించాలని నాయకుల డిమాండ్

ప్రజాశక్తి - తాడేపల్లి, మంగళగిరి

కౌలు రైతు చట్టం (సిసిఆర్సి) సవరించాలని, భూ యజమాని సంతకం తొలగించాలని, గ్రామ సభల ద్వారా కౌలు రైతులకు కౌలు కార్డులివ్వాలని తదితర డిమాండ్లతో కౌలు రైతు సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్రంలో ఈనెల 7వ తేదీ నెల్లూరు నుండి ఒకజాత, ఐదో తేదీన అనకాపల్లి నుండి మరొక జాత కౌలు రైతుల్ని చైతన్యం చేస్తూ, వారి సమస్యలు తెలుసుకుంటూ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పర్యటించింది. ముగింపుగా రెండు జాతాలు కృష్ణాజిల్లా తోట్ల వల్లూరు చేరుకున్నాయి. అక్కడి నుండి సోమవారం ఉదయం ప్రకాశం బ్యారేజీ మీదుగా ఉండవల్లి సెంటర్‌కు చేరుకుంది.

పాదయాత్రలో మాట్లాడుతున్న వి కృష్ణయ్య, వి.శ్రీనివాసరావు, వై రాధాకృష్ణ తదితరులు

పాదయాత్రలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై రాధాకృష్ణ, ఎం హరిబాబు, వ్యకాస రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు, రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి కృష్ణయ్య, ఉపాధ్యక్షులు వై కేశవరావు, సూర్యనారాయణ, కృష్ణా, గుంటూరు జిల్లాల నాయకులు, రైతులు పాల్గొన్నారు.

పాదయాత్రకు ఉండవల్లి సెంటర్‌లో రైతు సంఘం ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. అక్కడ నుంచి ప్రదర్శనగా మంగళగిరి తాడేపల్లి పాత జాతీయ రహదారిపై మంగళగిరి వరకు పాదయాత్ర నిర్వహించారు. మధ్యలో ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్ వద్ద కార్మికులు పాదయాత్రకు మంచినీటి సౌకర్యం కల్పించారు. అనంతరం ప్రకాష్‌నగర్ సెంటర్‌లో సిఐటియు ఆధ్వర్యంలో భారీగా ఘన స్వాగతం పలికారు. మజ్జిగ ప్యాకెట్లు అందజేశారు. మంగళగిరి సీసీఎల్ఏ కార్యాలయానికి వస్తున్న కౌలు రైతుల పాదయాత్రకు మంగళగిరి పట్టణంలో రెండు సెంటర్లలో ఆటో యూనియన్ నాయకులు ఘన స్వాగతం పలికారు. పూలమాలవేసి నాయకులపై పూల వర్షం కురిపించారు. ఎయిమ్స్ ముఖద్వారం వద్ద ఉన్న ఆటో స్టాండ్ వద్ద, అంబేద్కర్ సెంటర్లో స్వాగతం పలికారు. పాదయాత్ర సోమవారం మధ్యాహ్నానికి మంగళగిరి సీసీఎల్ఏ కార్యాలయానికి చేరుకుంది. అనంతరం అక్కడ ధర్నా నిర్వహించారు. సీసీఎల్ ఏను కలవడానికి కౌలు రైతులు రాష్ట్ర నాయకులు ఆధ్వర్యంలో ప్రయత్నించగా పోలీసులు అడ్డుకోవడంతో అర్ధగంట పాటు ధర్నా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం సి సి ఎల్ ఏ సెక్రటరీ ప్రభాకర్ రెడ్డి బయటకు వచ్చి వినతిపత్రం తీసు కున్నారు.

జాతాకు స్వాగతం చెబుతున్న నాయకులు

ధర్నాలో మాట్లాడుతున్న వి శ్రీనివాసరావు

మాట్లాడుతున్న ఎం హరిబాబు

గుంటూరు జిల్లాలో ప్రవేశించిన పాదయాత్రకు వివిధ సెంటర్‌లలో కౌలు రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి పి రంగారావు, ఉపాధ్యక్షులు ఏ బాలకృష్ణ, జిల్ల కార్యదర్శి బైరగాని శ్రీనివాసరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఈమని అప్పారావు, రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు జొన్నా శివశంకర్, పల్నాడు జిల్లా కార్యదర్శి ఏపూరి గోపాలరావు, ఎపి చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి బాలకృష్ణ, ప్రజాసంఘాల నాయకులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, మోదుగుల శ్రీనివాసరెడ్డి, బి కోటేశ్వరి, ఎస్ఎస్ చంగయ్య, జెవి రాఘవులు, బూరగ వెంకటేశ్వర్లు, వేముల దుర్గారావు, వి జవహర్‌లాల్, వివి భాస్కరరెడ్డి, ఎస్ గణేష్, ఎస్ వెంకటేష్, షేక్ జానీ భాష, నవీన్, షేక్ కాజా, తదితరులు ఘన స్వాగతం పలికారు.

ఈ సందర్భంగా పాదయాత్రలో, సిసిఎల్ఎ కార్యాలయం వద్ద నాయకులు ప్రసంగించారు. కౌలు రైతులకు నూతన రక్షణ చట్టం చేయాలని సిపిఎ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నూతన చట్టంలో కౌలు రైతుల హక్కులు, సంక్షేమానికి భరోసా ఉండాలని కోరారు. ప్రభుత్వం చిత్తశుద్ధితో ఈ పని చేయకపోతే కౌలు రైతుల తరుపున మరింత ఉధృతంగా పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. 2019 సంవత్సరంలో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం కొత్త చట్టాన్ని తీసుకొచ్చి కౌలు రైతులను ఇబ్బందులు పెడుతుందని విమర్శించారు. గుర్తింపు కార్డులు ఇవ్వాలంటే నిబంధన పెట్టడంతో చాలా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రకృతి వైపరీత్యాల వలన పంటలు నష్టపోయినప్పటికీ నష్టపరిహారం భూ యజమానుల ఖాతాలో వేస్తున్నారని, దాన్ని తీసుకోవడానికి కౌలు రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అందువల్ల ఈ చట్టాన్ని సవరించాలని డిమాండ్ చేశారు. ప్రత్యేకంగా మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని కోరారు.

కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి వైరాధాకృష్ణ, ఎం హరిబాబు మాట్లాడుతూ కౌలు రైతులు దివాళా తీయడానికి ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టాలే కారణమని విమర్శించారు. అన్ని తరగతుల ప్రజల మద్దతు కౌలు రైతులకు కూడగట్టి ఉద్యమిస్తామని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో ఇళ్ల ముందుకొచ్చిన ఎమ్మెల్యే, ఎంపిలు, ప్రజాప్రతినిధులను ప్రతి కౌలు రైతులు నిలదీయాలని కోరారు. రైతు భరోసా ఏడు వేల కోట్లు, వడ్డీ రాయితీ రెండు వేల కోట్లు, పంట బీమా మూడు వేల కోట్లు తదితర 12 వేల కోట్ల రాయితీలు ప్రభుత్వం కౌలు రైతులకు ఇవ్వడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇవన్నీ భూ యజమానులకే వస్తున్నాయన్నారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వకపోవడమే దీనికి కారణమన్నారు. భూ యజమాని సంతకం లేకుండా నేరుగా ప్రభుత్వ సబ్సిడీ కౌలు రైతుల అకౌంట్లో పడేలా చూడాలన్నారు. ఒక వైపు పంటలకు గిట్టుబాటు ధర లేక కౌలు రైతులకు అప్పులు పెరిగిపోతున్నాయన్నారు. కౌలు రైతులు సంక్షేమానికి ఈ ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేయడంలేదన్నారు. ఈ సీజన్లో దరఖాస్తు చేసుకున్న వారందరికీ రుణాలు, గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. ముందు అధికారులు దరఖాస్తు స్వీకరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన భూ యజమాని సంతకం తొలగించాలని డిమాండ్ చేశారు. దేవాలయ భూముల సాగు చేస్తున్న వారందరికీ సిసిఆర్ కార్డులు, బ్యాంకు రుణాలు, రైతు భరోసా, పంట నష్టపరిహారం, బీమా ఇవ్వాలని కోరారు. అప్పుల పాలై ఆత్మహత్య చేసుకున్న కౌలు రైతు కుటుంబాలకు 25 లక్షల రూపాయలు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులు తమ సమస్యల గోడును విన్నవించుకోవడానికి సిసిఎల్ కార్యాలయానికి వచ్చిన అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శించారు. పోలీసులను అడ్డుపెట్టుకొని రానివ్వకుండా చూడడానికి చూస్తున్నారని అన్నారు. రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం సూర్యనారాయణ మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని కాపాడుకోవాలంటే కౌలు రైతుల సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆహార పంటలు ఎంతో కష్టపడి పండిస్తున్న కౌలు రైతుల కష్టాలు తీర్చకపోతే ప్రజలు నానా ఇబ్బందులు పడతారని, ఆహార ఉత్పత్తులు తగ్గిపోతాయని అన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు మాట్లాడుతూ సిసిఆర్ కార్డు పొందలేని కౌలు రైతులకు సాగు ధ్రువీకరణ పత్రం ఇచ్చే విధంగా చట్టంలో మార్పు తీసుకురావాలని డిమాండ్ చేశారు.

15 నుంచి కడప స్పోర్ట్స్ స్కూల్లో ప్రవేశాలకు ఎంపికలు

ప్రజాశక్తి-గుంటూరు

కడప, డాక్టర్ వైఎస్ఆర్ స్పోర్ట్స్ స్కూల్‌లో 4 తరగతి, 5వ తరగతి ప్రవేశానికి మండల స్థాయిలో ఎంపికలు ఈనెల 15వ తేదీ నుంచి నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ సిఇఒ ఎస్.పల్లవి, చీఫ్ కోచ్ జి.వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలియజేశారు. 15వ తేదీ నుంచి 20 వరకూ మండల స్థాయిలో ఎంపిడిఒ కార్యాలయాల్లో ఎంపికలు ఉంటాయన్నారు. మండల స్థాయిలో ఎంపికైన వారికి 23, 24 తేదీల్లో ఉదయం 9 గంటలకు గుంటూరు బిఆర్ స్టేడియంలో జిల్లా స్థాయి ఎంపికలు ఉంటాయని చెప్పారు. 5వ తరగతిలో ప్రవేశానికి 2013 ఆగస్టు 1 నుంచి 2014 జులై 31 మధ్య జన్మించి, 4వ తరగతి పూర్తి చేసి ఉండాలన్నారు. అలాగే 4వ తరగతి ప్రవేశానికి విద్యార్థుల వయస్సు 2014 ఆగస్టు 1 నుంచి 2015 జులై 31 మధ్య జన్మించి ఉండాలని, 3వ తరగతి పూర్తి చేసి ఉండాలన్నారు. ఎంపిలకు జనన ధృవపత్రం, స్టడీ, కుల, ఆదాయ ధృవపత్రాలు, ఆధార్ కార్డు జిరాక్స్, పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు సమర్పించాల్సి ఉంటుందన్నారు.

లలితా హాస్పిటల్ రూ.5 లక్షల వితరణ

ప్రజాశక్తి-గుంటూరు

చెక్కును అందచేస్తున్న హాస్పిటల్ మేనేజర్

కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బులిటీలో భాగంగా, జిల్లా కలెక్టర్ సూచనల మేరకు ఎస్సీ, ఎస్టీ, బిసి హాస్టల్స్ అభివృద్ధికి లలితా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ రాఘవ శర్మ రూ.5 లక్షల చెక్కును అందచేశారు. సదరు చెక్కును హాస్పిటల్ మేనేజర్ సురేష్ సోమవారం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎ.శ్రావణబాబుకు అందచేశారు.హాస్టల్స్‌లో మౌలిక సదుపాయాలు కల్పనకు తమ వంతు బాధ్యతగా ఈ నిధిని అందచేస్తున్నట్లు యాజమాన్యం తెలిపింది. ఇతర సంస్థలు కూడా మానవతా దృక్పదంతో హాస్టల్స్ అభివృద్ధికి నిధులు అందచేయటానికి ముందుకు రావాలని డాక్టర్ శ్రావణ్‌బాబు విజ్ఞప్తి చేశారు.

రేపు పెన్షన్ అదాలత్

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు, కృష్ణా, ప్రకాశం జిల్లాల పరిధిలో ఉన్న భవిష్యనిధి పెన్షనర్లు, వారి ఫిర్యాదులు, దర్యాప్తులు నేరుగా భవిష్యనిధి కార్యాలయంలో ఈనెల 14న ఉదయం 11 గంటలకు జరిగే పెన్షన్ అదాలత్‌లో అందచేయవచ్చని రీజనల్ పిఎఫ్ కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు. నేరుగా కార్యాలయానికి రాలేని వారు ఆన్‌లైన్‌లో ఈ మెయిల్ (ro.guntur@epfindia.gov.in) ద్వారాగానీ, వాట్సాప్ 9494657469 ద్వారా పంపించే సదుపాయం కూడా ఉందన్నారు. ప్రతి పెన్షనర్ సాధ్యమైనంత వరకూ ఆన్‌లైన్ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మేధో సంపత్తి హక్కుపై హిందూ ఫార్మసీలో వెబినార్

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కాలేజిలో ఫార్మాస్యూటికల్ మేనేజ్‌మెంట్, రెగ్యులేటరీ అఫైర్స్ శాఖ, నాగ్‌పూర్‌లోని రాజీవ్ గాంధీ నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ ప్రాపర్టీ మేనేజ్ మెంట్, సంయుక్తంగా మేధో సంపత్తి హక్కు, అర్హతలపై వెబినార్ నిర్వహించారు. ఈ వెబినార్‌లో ముఖ్య అతిధిగా ఎన్ఐపిఎ అసిస్టెంట్ కంట్రోలర్ ఆఫ్ పేటెంట్స్ అండ్ డిజైన్స్ డాక్టర్ భరత్ ఎన్.సూర్యవంశీ మాట్లాడుతూ వివిధ రకాల మేధా సంపత్తి హక్కులు, నమోదు చేసే పద్ధతులు, వివిధ రకాల పేటెంట్స్, డిజైన్స్ వాటి నిర్ణీత కాల పరిమితి,పేటెంట్ పొందిన వారి హక్కులు, ఈ శాఖలో ఉపాధి అవకాశాలు సంబంధిత విషయాలపై విద్యార్థులకు పవర్ పాయింట్ ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.వి. నాగభూషణం కాలేజి చైర్మన్ జూపూడి రంగరాజు ప్రసంగించారు.

బ్లాక్ బెల్ట్ సర్టిఫికెట్లు ప్రదానం

ప్రజాశక్తి - తెనాలి :స్థానిక చెంచుపేట యూనిక్ తైక్వాండో అకాడమీ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన విద్యార్థులకు బ్లాక్ బెల్ట్, పది, ఇంటర్లో సత్తాచాటిన విద్యార్థులకు ఉపకార వేతనాలను సోమవారం పంపిణీ చేశారు. అకాడమీ డైరెక్టర్ బి నాగరాజు అధ్యక్షతన అకాడమి కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో హైదరాబాద్ ఇన్కమ్‌టాక్స్ అడిషనల్ కమిషనర్ వి కోటేశ్వరమ్మ రాయుడు గీతాంజలి, రాయుడు పుష్పాంజలి, షేక్ మోహిన్, తోట రమ్యశ్రీ, కంభం వినయ్ కు బ్లాక్ బెల్ట్‌ను అందించారు. పది, ఇంటర్లో మంచి మార్కులు సాధించిన డోగుపర్తి లోహిత(569), సోముల హాసిని(565), పి.రాజ్యలక్ష్మి(585), సౌతాన్ని జోత్స్న505), ఇంటర్మీడియట్లో ఆకురాతి భవ్యశ్రీ (979)రూ.2వేలు నగదు పారితోషికం అందుకున్నారు. కార్యక్రమంలో యూనిక్ తైక్వాండో అకాడమీ రాష్ట్ర అధ్యక్షులు తోట నాగేశ్వరరావు, రాష్ట్ర పద్మశాలి ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షులు జి. వెంకటశివరామకృష్ణ, తెనాలి ఉపాధ్యక్షులు ఎం.బాల చంద్రమౌళి, మైత్రి హాస్పిటల్ డాక్టర్ ఆలపాటి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

చెక్కును అందిస్తున్న ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, మంత్రి రాంబాబు

మృతుని కుటుంబానికి రూ.10 లక్షల సిఎం సహాయనిధి

వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ కుటుంబానికి చెక్కును అందించిన మంత్రి, ఎంపీ

ప్రజాశక్తి - రాజుపాలెం

రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ బత్తుల రామస్వామి ఇటీవల మరణించారు. ఆయన కుటుంబానికి సిఎం సహాయనిధి కింద రూ.10 లక్షలను వారి కుటుంబీకులకు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు సోమవారం అందించారు. మండలంలోని బ్రాహ్మణపల్లికి వచ్చిన వారు రామస్వామి చిత్రపటానికి పూలమాలలేసి నివాలులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ సర్పంచ్‌గా, మండల పరిషత్ అధ్యక్షునిగా అభివృద్ధికి కృషి చేశారని, ఆయన మృతి బాధాకరమని అన్నారు.

హెచ్ఎం విరాళాన్ని అందిస్తున్న గ్రామస్తులు

పాఠశాల అభివృద్ధికి రూ.50 వేలు విరాళం

ప్రజాశక్తి - యడ్లపాడు

మండలంలోని లింగారావుపాలెం జెడ్‌పి పాఠశాలలో మౌలిక వసతులు సమకూర్చేందుకు రూ.50 వేలను హైదరాబాద్‌లో నివసిస్తున్న లింగారావుపాలేనికి చెందిన నంబూరి నరసింహారావు విరాళంగా ఇచ్చారు. ఈ మొత్తాన్ని హెచ్‌ఎం కెవి రామిరెడ్డికి స్థానికులు తోకల సత్యనారాయణ ద్వారా సోమవారం అందించారు. భవిష్యత్‌లోనూ పాఠశాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని చెప్పారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ గతంలోనూ పాఠశాల అభివృద్ధికి నరసింహారావు సహకరించారని కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ కో ఆప్షన్ సభ్యులు ఎన్.శివరామకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విలేకరి వెంకటేశ్వర్లుకు పుల్లారావు నివాళి

ప్రజాశక్తి - చిలకలూరిపేట

పట్టణంలోని 36వ వార్డుకు చెందిన విలేకరి ఎలిసెట్టి వెంకటేశ్వర్లు ఆదివారం గుండెపోటుతో మృతి చెందారు. ఆయన భౌతికకాయాన్ని మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు సందర్శించి నివాళులర్పించారు. వెంకటేశ్వర్లు కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

పాఠశాలలకు సెలవులు పొడిగించాలి

ప్రజాశక్తి - సత్తెనపల్లి టౌన్

ప్రభుత్వ పాటశాలలకు సెలవులను పొడిగించాలని జై భీం భారత్ పార్టీ పల్నాడు జిల్లా అధ్యక్షులు జె.విజయ్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. నాలుగు రోజులుగా అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో విద్యార్థుల ఆరోగ్యాన్ని పరిగణలోకి తీసుకోని సెలవులను మరో వారం పొడిగించాలని కోరారు.

పలు పాఠశాలల్లో జెవికె కిట్లు పంపిణీ

ప్రజాశక్తి - నరసరావుపేట

ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని రొంపిచర్ల ఎంపిపి గడ్డం బాలనాగమ్మ అన్నారు. మండల కేంద్రమైన రొంపిచర్లలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జగనన్న విద్యా కానుక కిట్‌ల పంపిణీని సోమవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅథిగా హాజరైన ఎంపిపి మాట్లాడుతూ గతంలో ఎవరూ చేయని విధంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగాన్ని అభివృద్ధి చేస్తున్నారని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలకు అన్ని సౌకర్యాలూ కల్పిస్తున్నారని, ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలను తీర్చిదిద్దుతున్నారని అన్నారు. నాణ్యమైన విద్యనూ అందిస్తున్నట్లు చెప్పారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని, ప్రయివేటు పాఠశాలల ఫీజుల దోపిడీకి గురికావొద్దని సూచించారు. అనంతరం విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ కె.నాగేశ్వరరావు, ప్రధానోపాధ్యాయులు బి.ఎం సుభాని, తల్లిదండ్రుల కమిటీ ఛైర్మన్ టి.రామిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పెదకూరపాడు

మండలంలోని గారపాడు పాఠశాలలో జగనన్న విద్యా కానుక కిట్లను విద్యార్థులకు జెడ్‌పిటిసి కంకణాల స్వర్ణకుమారి శివాజీ సోమవారం పంపిణీ వేశారు. కార్యక్రమంలో విద్యా కమిటీ ఛైర్మన్ కె.వెంకటేశ్వరరావు, హెచ్‌ఎం శివనాగేశ్వరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఈపూరు

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తోందని కొచ్చర్ల సర్పంచ్ కోపెల దేవరాజు అన్నారు. గ్రామంలోని జెడ్‌పి పాఠశాలలో జగనన్న విద్యా కానుక కిట్లను హెచ్‌ఎం వై.లక్ష్మీ ప్రసన్నతో కలిసి విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా దేవరాజ్ మాట్లాడుతూ విద్యతో పేదరికాన్ని జయించవచ్చని, విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకుని చదువులో రాణించాలని సూచించారు.



ప్రజాశక్తి - నాదెండ్ల

మండలంలోని శ్రీ కెల్లంపల్లి భద్రాచలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గణపవరంలో విద్యార్థులకు జెవి కిట్లను పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్ సురా శంకర్‌రెడ్డి, హెచ్‌ఎం ఐ.కృష్ణా నాయక్, వార్డు కౌన్సిలర్లు అందించారు. కార్యక్రమంలో పిఇటి జె.శ్రీకాంత్, పీడీ వేణుగోపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డబ్బు తీసుకున్నట్లు నిరూపిస్తే రాజీనామా : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - వినుకొండ

రియల్టర్ల వద్ద ఎమ్మెల్యే డబ్బు తీసుకున్నట్లు మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు చేసిన ఆరోపణలను ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు తీవ్రంగా ఖండించారు. తాను డబ్బు తీసుకున్నట్టు నిరూపిస్తే పదవికి రాజీనామా చేస్తానని సవాల్ విసిరారు. ఈ మేరకు సోమవారం స్థానిక వైసిపి కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. బొల్లాపల్లి మండలం అయ్యన్నపాలెంలో ప్రభుత్వ భూములకు పేదలకు పట్టాలు ఇచ్చినట్లు చూపి జీవీ ఆంజనేయులు అమ్ముకున్నారని విమర్శించారు. కొప్పుకొండ భూముల్లో చేపల చెరువులుగా మార్చి ప్రభుత్వ భూములను ఆక్రమించింది ఎవరని ప్రశ్నించారు. 4 వేల టిడ్కో ఇళ్లకు గాను 250 ఇళ్లు మాత్రమే పూర్తి చేశారని అన్నారు. తాను అభివృద్ధి చేస్తుంటే చూడలేక కోర్టుల్లో కేసులు వేసి అడుగడుగునా అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. వైసిపి మేనిఫెస్టోని కాపీ చేసి చంద్రబాబు మరోసారి ప్రజలను మోసం చేసేందుకు సిద్ధమయ్యారని ఎద్దేవ చేశారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

తాగునీటిని సరఫరా చేయలేని ప్రభుత్వం : పుల్లారావు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

సురక్షిత తాగునీటి సరఫరా వైఫల్యంపై మంత్రి విడదల రజినికి మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు సోమవారం సెల్ఫీ ఛాలెంజ్ విసిరారు. స్థానిక 11వ వార్డు ఏలూరు డొంకలో పర్యటనకు వెళ్లిన తనకు అక్కడి మహిళలు పలు సమస్యలను విన్నవించారని పుల్లారావు అన్నారు. నాలుగేళ్లు పూర్తయినా అమృత్ పథకం కింద తాగునీరు ఇవ్వలేదని, సంక్షేమ పథకాలు సరిగా అందడం లేదని, తాగునీరు సరఫరా చేయడం లేదని స్థానికులు చెప్పారని అన్నారు. డ్రెయినేజీలు నిర్మించట్లేదని, కుళాయిల ఏర్పాటుకు డబ్బులు అడుగుతున్నారని విమర్శించారు. సమస్యలను చెబుతుంటే అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించడం లేన్నారు. ఈ అంశంలో వైసిపికి చెందిన మహిళల్లోనూ ఆగ్రహం నెలకొందని చెప్పారు. స్థానిక సమ్మర్ స్టోరేజీ ట్యాంక్‌ను పరిశీలించారు. చిలకలూరిపేట శాశ్వత తాగునీటి పరిష్కారం కోసం అమృత్ పథకం కింద 9, 10, 11, 12, 19 వార్డులకు రక్షిత నీటిని అందించేందుకు రూ.160 కోట్లతో సమ్మర్ స్టోరేజీని ఏర్పాటు చేశామని, 12 లక్షల లీటర్ల సామర్థ్యంతో నిర్మించిన సమ్మర్ స్టోరేజ్ అందుబాటులోకి వస్తే 5 వార్డుల్లో నీటి ఇక్కట్లు ఉండవని పుల్లారావు అన్నారు. నాలుగేళ్లయినా సమ్మర్ స్టోరేజీ ట్యాంక్‌ను పూర్తి చేయకుండా ఇప్పుడు ఎన్నికలు వస్తున్నాయనే ఉద్దేశంతో హడావుడి చేస్తున్నారని విమర్శించారు. తాగునీరు రావట్లేదని గడప గడపకు ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి రజిని దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని స్థానిక మహిళలు చెప్పారన్నారు. రాష్ట్రంలో ఎక్కడాలేని అవినీతి చిలకలూరిపేటలో జరుగుతోందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు షేక్ కరీముల్లా, షేక్ సుభాని, సమద్ ఖాన్, కె.వీరారెడ్డి, బి.రవి, షేక్ కమాల్‌బాషా, రసూల్ పాల్గొన్నారు.

ఆర్భాటాల కోసమే ప్రారంభోత్సవాలు : టిడిపి

ప్రజాశక్తి - బెల్లంకొండ

ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి చేస్తున్న ప్రారంభోత్సవాలు ఆర్భాటాలకే పరిమితమవుతాయని టిడిపి మండల అధ్యక్షులు ఎన్.లక్ష్మీనారాయణ విమర్శించారు. ఈ మేరకు సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ నాలుగేళ్లుగా చేయని అభివృద్ధిని ఆరు నెలల్లో చేస్తారా? అనిప్రశ్నించారు. ఎన్నికల కోసమే కృష్ణా నదిపై బ్రిడ్జి, అమరావతి నుండి బెల్లంకొండ వరకు నాలుగు లైన్ల రోడ్డుకు శంకుస్థాపన చేశారని అన్నారు. అమరావతి ప్రజల మీద అభిమానం ఉంటే ఓకే రాజధాని అమరావతి అని ప్రకటించాలని డిమాండ్ చేశారు. పెదకూరపాడు నియోజకవర్గంలో ఉన్న రోడ్లను చెడగొట్టి నెలలు గడుస్తున్నా వేయకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని విమర్శించారు. కార్యక్రమంలో వి.సీతారాంరెడ్డి, సర్పంచ్ సముద్రం పాల్గొన్నారు.

కొచ్చెర్లలో జనసేన పాదయాత్ర

ప్రజాశక్తి - వినుకొండ

జనసేన అధినేత పవన్‌కల్యాణ్ బుధవారం నుండి నిర్వహించే వారాహి యాత్ర విజయవంతం కావాలని కోరుతూ ఈపూరు మండలం కొచ్చెర్లలో ఆ పార్టీ శ్రేణులు సోమవారం పాదయాత్ర చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన నిశ్శంకరావు శ్రీనివాసరావు మాట్లాడుతూ పవన్ యాత్రలో అందరూ కలిసి రావాలని కోరారు. కార్యక్రమంలో ఎన్.అంకారావు, వి.శ్రీనివాసరావు, నరసింహారావు, ఎస్.నరసింహారావు, ఎ.అంకమ్మరావు పాల్గొన్నారు.

మండల కేంద్రమైన స్థానిక అమరేశ్వరస్వామి దేవస్థానంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి వేమూరి గోపి విశ్వనాథశర్మ దంపతులు సోమవారం అమరేశ్వర స్వామివారి అభిషేకంలో పాల్గొన్నారు.

విద్యార్థులకు 'జగనన్న విద్యా కానుక' కిట్‌లు

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

ఎంటిఎంసి పరిధిలోని వడ్డేశ్వరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు జగనన్న విద్యా కానుక పథకం కింద నాల్గో విడత కిట్‌ల పంపిణీ కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ కార్యక్రమాన్ని వైసిపి గ్రామ నాయకులు కె.రాఘవరావు, జి. శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ షేక్ చిన రంగ షరీఫ్ ప్రారంభించారు. విద్యా సం క్షేమానికి ముఖ్య మంత్రి వైఎస్ జగన్ గత నాలుగేళ్లగా వేల కోట్ల రూపాయలను ఖర్చు చేస్తున్నారని నాయకులు కొనియాడారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.సుబ్బా రావు, ఉపాధ్యాయులు కె.జోజప్ప, బుజ్జి బాబు, వెంకటేశ్వర రావు, రామచంద్రరావు, రామ చంద్రా రెడ్డి, స్కూల్ కమిటీ చైర్మన్ సిహెచ్ .నాగజ్యోతి పాల్గొన్నారు. **చేబ్రోలు:** జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేయడం జరిగిందని చేబ్రోలు మండల ఇన్‌ఛార్జి విద్యాశాఖ అధికారి జె సుబ్బారావు తెలి పారు. సూర్యదేవర నరసయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వేసవి సెలవుల తర్వాత పాఠశాలలు పున:ప్రారంభమయ్యా యని, తొలి రోజునే జగనన్న విద్యా కానుకలను విద్యార్థు లకు పంపిణీ చేయడం జరిగిందని అన్నారు. ముఖ్య అతిథిగా చేబ్రోలు సర్పంచ్ వినీతా రాణి పాల్గొని మాట్లాడారు. జగనన్న విద్యా కానుక కిట్‌ల పంపిణ కార్య క్రమం స్థానిక నారాకోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు ఎం.ఏడుకొండలు అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా చేబ్రోలు ఎంపిపి కె. సాహితి హాజరయ్యారు. 300 మంది విద్యార్థులకు కిట్లను బహూ కరించారు. అనంతరం ఎంపిపి, జిడిసిఎం ఎస్ మార్కెటింగ్ డైరెక్టర్ కుర్ర పాములు, ప్రధానోపాధ్యాయులు మాట్లాడారు. కార్యక్రమంలో తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ అంకమ్మరావు తదితరులు పాల్గొన్నారు. **తాడేపల్లి:** స్థానిక జిల్లా పరిషత్ స్కూల్లో జగనన్న విద్యాకానుక కిట్లను పంపిణీ చేశారు. నూతన విద్యా సంవత్సరం ప్రారంభం రోజే స్కూల్ బ్యాగుతో పాటు మూడు జతల యూనిఫారం, నోట్లు పుస్తకాలు, టెక్స్ పుస్తకాలు, రెండు జతల షూస్, సాక్సులు, బెల్ట్, డిక్షనరీ ప్రతి విద్యార్థికీ అందజేశారు. సోమవారం హాజరుకాని విద్యారులు ఉపాధ్యాయులను అడిగి తీసుకోవచ్చ న్నారు. కార్యక్రమంలో ప్రధాపోపాధ్యాయులు భీమిరెడ్డి తాతిరెడ్డి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ బి.లక్ష్మీ, సాంబశివ రావు, లావణ్య, అనితారాణి, ఎస్‌కె అన్వం పాల్గొన్నారు. **తాడికొండ:** ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయని నియోజకవర్గం సమన్వయ కర్త కత్తెర సురేష్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని పొన్నె కల్లు గ్రామ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు విద్యా కానుక కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ జిల్లా పరిషత్ హై స్కూల్ అభివృద్ధికి తన వంతుగా పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంఇఒ తెనాలి ఇం దిరా ఎం డిఒ ఎ. దీప్తి, హెచ్‌ఎం షేక్ జరీనా బేగం, సర్పంచ్ ఎన్. మేరెమ్మ, ఎంపిటిసి ఎన్.మరియమ్మ, పాల్గొన్నారు. **పొన్నూరురూరల్:** మండలంలోని బ్రాహ్మణకోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలనందు జగనన్న విద్యా కానుక పం పిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె. గౌరీశ్వరిదేవి, సర్పంచ్ కె.అశోక్ కుమార్, విద్యా కమిటీ చైర్మన్ ఎన్.రమేష్ , కాంప్లెక్స్ సిఆర్పి డి.దాసు తదితరులు పాల్గొన్నారు. **తెనాలి:** ప్రభుత్వ పాఠశాలలు పున్న ప్రారంభం రోజున విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేశారు. స్థానిక గంగానమ్మపేటలోని టిఎస్ ఆర్‌ఎం హైస్కూల్ విద్యార్థులకు ఆ వార్డు కౌన్సిలర్ గొడవర్తి సాయి హరే రామ్ చేతుల మీదుగా జీవీకే కిట్లను పంపిణీ చేశారు. పుస్తకాలు, బ్యాగ్ ,యూనిఫామ్, షఉ, సాక్స్, బెల్ట్, ఆక్స్ఫర్డ్ డిక్షనరీ వగైరా కిట్లో ఉన్నట్టు ఆయన చెప్పారు. ప్రధానోపాధ్యాయులు విడిఆర్ ప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తోటకూర వెంకటరమణ రావు, ఉపాధ్యాయ బందం పాల్గొన్నారు. అలాగే రూరల్ గ్రామం పెదరావూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గ్రామ సర్పంచ్ కాకి రమాదేవి చేతుల మీదగా జేవీకే కిట్లు అందజేశారు కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయిని పి.సరళ, ఉపాధ్యాయులు అనురాధ, సుధాకర్, అంకమ్మరావు, స్థానిక నాయకులు మనోజ్ పాల్గొన్నారు.



వెంకటప్పయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న హకీంజాని తదితరులు

గ్రంథాలయోద్యమ ప్రముఖులు వెలగాకు నివాళి

ప్రజాశక్తి-తెనాలి

గ్రంథాలయోద్యమ ప్రముఖులు డాక్టర్ వెలగా వెంకటప్పయ్య జయంతిని స్థానిక నెహ్రూరోడ్డులోని శాఖా గ్రంథాలయంలో సోమవారం నిర్వహించారు. ప్రముఖ బాల సాహితీవేత్త షేక్ అబ్దుల్ హకీంజాని ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో తొలుత వెంకటప్పయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హకీంజాని మాట్లాడుతూ వెంకటప్పయ్య ఎందరో బాలసాహితీవేత్తలను పుస్తకాలు రాసే విధంగా ప్రోత్సహించారని కొనియాడారు. గ్రంథాలయ ఉద్యమంతో పాటు, బాలసాహిత్యంపై ఆయన చేసిన సేవ లను ప్రశంసించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి కె.రమాదేవి, రిటైర్డ్ లైబ్రేరియన్ ఎం.సుబ్బారావు, డాక్టర్ పాండు రంగారావు, ఎల్,లక్ష్మణరావు, గ్రంథాలయ సిబ్బంది లావణ్య సుధ, పద్మ పాల్గొన్నారు.

'రాష్ట్ర భవిష్యత్తును బిజెపికి పాదాక్రాంతం'

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

వైసిపి, టిడిపి,జనసేన పార్టీలు రాష్ట్ర భవిష్యత్తును బీజేపీ పాదాక్రాంతం చేశాయని పొన్నూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి జక్కా శ్రీనివాస్ విమర్శించారు. ప్రాంతీయ పార్టీలు కేవలం తమ రాజకీయ మనుగడ కోసమే రాష్ట్ర ప్రయోజనాలను బిజెపికి తాకట్టు పెడుతోందని అన్నారు. విభజన హామీలను విస్మరించి నిస్సిగ్గుగా రాష్ట్ర పర్యటనకు వచ్చిన కేంద్రహోం శాఖ మంత్రిఅమిత్ షాకు, రాష్ట్ర బీజేపీ కి మద్దతు పలికిన వైఎస్ జగన్,చంద్రబాబు, పవన్‌లకు సిగ్గుండాలని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఆదివారం విశాఖపట్టణం లో జరిగిన బీజేపీ 'మహాజన సం పర్క్ అభియాన్' సభకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన అమిత్ షా ప్రసంగంపై ఆయన విమర్శలు గుప్పించారు. ఈ సందర్భంగా సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రీనివాస్ మాట్లాడుతూ విభజన హామీలు అమలు చేయలేదని, పోలవరం ప్రాజెక్టు, రెవిన్యూ లోటుకు కేటా యించిన నిధుల విడుదల చేయకుండా బీజేపీ కి ఈ రాష్ట్రంలో ఓట్లు అడిగే హక్కు ఎక్కడిదని ప్రశ్నించారు. 20 పార్లమెంట్ స్థానాల్లో గెలిపించమని అమిత్‌షా అడగడం విడ్డూ రంగా ఉందన్నారు.



చేనేతల డిమాండ్ల సాధన కోసం 19న ధర్నా

ప్రజాశక్తి - మంగళగిరి

చేనేత ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 19 వ తేదీన రాష్ట్రంలోని అన్ని కలెక్టర్ కార్యాలయాల వద్ద ధర్నా కార్యక్రమాలు చేపట్టి కలెక్టర్‌కు వినతిపత్రాలు ఇవ్వాలని నిర్ణయించారు. వేములపల్లి శ్రీకృష్ణ భవన్‌లోని చేనేత కార్యాలయంలో చేనేత ఐక్య కార్యాచరణ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సమావేశంలో చేనేత ఐక్య కార్యచరణ కమిటీ నాయకులు పిల్లలమర్రి నాగేశ్వరరావు, రామనాథం పూర్ణచంద్రరావు లు మాట్లాడుతూ చేనేతల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం 19వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా అన్ని కలెక్టర్ కార్యాలయాల వద్ద ధర్నా కార్యక్రమాలు నిర్వహించి,కలెక్టంకు వినతిపత్రాలు సమర్పించనున్నట్లు చెప్పారు. ధర్నా కార్యక్రమాల్లో నేతన్నలు, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో సభలు, సమావేశాలు జరుగుతున్నాయి. అలాగే,మంగళగిరిలో ఐక్య కార్యాచరణ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో 19న గుంటూరులో కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించే కార్యక్రమానికి అధిక సంఖ్యలో తరలివెళ్లాలని సమా వేశంలో నిర్ణయించారు.16వ తేదీన మంగళగిరి ప్రాంతంలో ని మగ్గాల షెడ్ల వద్దకు వెళ్ళి కరపత్రాల ద్వారా, 17న మైకు ప్రచారం చేయాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో ఐక్య కార్యాచరణ కమిటీ నాయకులు పిల్లలమర్రి బాలకృష్ణ, కూర పాటి కోటేశ్వరరావు, దొడ్డి ఈశ్వరరావు, డోకి పర్తి రామారావు, మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గుండిమెడలో తాగునీటి సమస్యను పరిష్కరించండి

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

ఎంటిఎంసి పరిధిలోని గుండిమెడలో తాగునీటి సమ స్యను పరిష్కరించాలని సిపిఎం తాడేపల్లి మండల నాయకులు పల్లె కృష్ణ కోరారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటలో చేశారు. గ్రామంలో నెలల తరబడి తాగునీటి సమస్య ఉందని అన్నారు. వేసవికాలం కావడంతో ఈ సమస్య మరింత తీవ్రమైందని, ఏడాది కాలంగా గ్రామంలోని తాగునీటి పైప్ లైన్లు రిపేరులో ఉన్నప్పటికీ ఏ ఒక్క మున్సిపల్ అధికారి కూడా ఈ సమస్యను పరి ష్కరించే దిశగా చర్యలు చేపట్టలేదని విమర్శించారు. గంటల తరబడి నీటి కుళాయిల వద్ద మహిళలు, వృద్ధులు బిందెలు, బకె ట్లతో ఎదురు చూసే పరిస్థితి నెలకొందని తెలిపారు. మున్సిపల్ అధికారులు. కనీసం వాటర్ ట్యాంకుల ద్వారా అయినా తాగు నీటి సరఫరా చేయడం లేదని విమర్శించారు. తక్షణమే వాటర్ ట్యాంక్‌ను శుభ్రం చేయాలని, పైప్ లైన్లకు మరమ్మతులు చేసి చేసి తాగునీరు సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

తాగునీటి కోసం ఎదురుచూస్తున్న మహిళలు

ప్రభుత్వ కళాశాలలో చదివి మంచి ఫలితాలు సాధించొచ్చు

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదవటం ద్వారా అత్యుత్తమ ఫలితాలను సాధించవచ్చని వెల్లలూరు గ్రామ ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు అన్నారు. పొన్నూరు మండల పరిధిలోని వెల్లలూరులో ఇంటర్మీడియట్ విద్య కోసం గవర్నమెంట్ కాలేజీని ప్రభుత్వం ఏర్పాటు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ కళాశాలలో చదవడం ద్వారా మంచి ఫలితాలను సాధించవచ్చని విద్యార్థుల తల్లిదండ్రులకు అధ్యాపకులు వివరించి చెబుతూ సోమవారం ఆ గ్రామంలో పర్యటించారు. విద్యార్థుల తల్లిదండ్రుల నుండి మంచి స్పందన లభించింది. ప్రభుత్వ కళాశాలలో అర్హత కలిగిన అధ్యాపకులు ఉండటంతో పాటు వారు మేలైన విద్యను విద్యార్థులకు అందజేయడం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె రమేష్ ,అధ్యాపక బందం పెరుగు సజన, శివ నాగేశ్వం రావు, రవిచంద్ర ,సయ్యద్ షహనాజ్, టి అరుణ్ కుమార్, ఎంఎం ఖుద్దూస్ , చంద్రశేఖర శ్రీనివాస్ , కె. బాబు రావు పీజీటీ కమిటీ బృందం పాల్గొంది.

ఉద్యోగాలు పొందిన పూర్వ విద్యార్థులకు సత్కారం

ప్రజాశక్తి - తెనాలి

స్థానిక కొత్త పేట లోని రావి సాంబయ్య మున్సిపల్ ఉన్నత పాఠ శాలలో చదివిన ఇరు వురు పూర్వ విద్యార్థులు ఉద్యోగాలు పొందిన సందర్భంగా వారిని పాఠశాలలో సోమవారం అభినందించారు. ప్రధానోపాధ్యాయిని షేక్ మౌలాబి తెలిపిన వివరాల ప్రకారం పాఠశాలలో పదో తరగతి వరకు చదివిన విద్యార్థులలో ఎం.అనిల్ కుమార్ డిగ్రీ పూర్తి చేసి సెంట్రల్ ఆర్మడ్ ప్రొటెక్షన్ ఫోర్స్ లో, అలాగే మునిపల్లె సుల్తాన్ ఇంటర్ పూర్తి చేసి ఇండియన్ నావీలో ఉద్యోగం పొందారు. వీరిరువురూ పాఠశాల దశలో ఎన్సిసి విద్యార్థులు కూడా. ఈ నేపథ్యంలో ఎన్సిసి ఆఫీసర్ పరిశా సర్దార్ ఆధ్వర్యంలో ఇరువురిని సత్కరించారు మండల విద్యాధికారి ఎం లక్ష్మీనారాయణ, మున్సిపల్ వైస్ చైర్మన్ మాలే పాటి హరిప్రసాద్, టి.రవీంద్ర విజయకుమార్ పాల్గొన్నారు.

స్పందన అర్జీలు రీఓపెన్ కాకుండా చూడాలి

ప్రజాశక్తి-గుంటూరు

అర్జీలు స్వీకరిస్తున్న జెసి రాజకుమారి

స్పందన అర్జీలు రీఓపెన్ కాకుండా ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా సంయుక్త కలెక్టర్ జి. రాజకుమారి ఆదేశించారు. సోమవారం కలక్టరేట్‌లోని ఎస్.ఆర్.శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి, డిఆర్ఓ కె.చంద్రశేఖర రావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లలితా, ఎం.వెంకటశివరామిరెడ్డి, డిప్యూటీ కలెక్టర్లు మోవిడి వాణి, సాయిశ్రీ జిల్లాలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి 129 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా సంయుక్త కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్నకు చెబుదాం, స్పందన కార్యక్రమం ద్వారా ప్రజల నుండి అందిన ఫిర్యాదులను నిర్ణీత గడువులోపు నాణ్యతగా, గుణాత్మకంగా పరిష్కరించాలన్నారు. పరిష్కరించే తిరిగి రీఓపెన్ కాకుండా ఉండే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. శాఖల వారీగా పెండింగ్ దరఖాస్తులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమీక్షిస్తూ, వెంటనే పెండింగ్ ఫిర్యాదులపై సహేతుక చర్యలు తీసుకొని సంతప్తికర సమాధానాన్ని అందివ్వాలన్నారు. మోడల్ సచివాలయాల్లో టాయిలెట్లు, త్రాగునీరు, ఫోన్ ఛార్జింగ్ సౌకర్యం, ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందుబాటులో వుంచాలన్నారు. సచివాలయ సిబ్బందికి మూడు జతల యూనిఫారాలు అందివ్వడం జరిగిందని, సచివాలయ సిబ్బంది అందరూ తప్పక యూనిఫారం ధరించేలా చూడాలన్నారు. యంపీడీఓ లు, మున్సిపల్ కమీషనర్లు తప్పని సరిగా వైయస్సార్ బీమా రెన్యువల్ చేయించాలని, అలాగే నామినీని కూడా ఏర్పాటు చేయించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ హరిహరనాథ్, ఎస్సీ వెల్ఫేర్ డిడి మధుసూధనరావు, పంచాయతీరాజ్ ఎస్.ఇ గుర్రం బ్రహ్మయ్య, జిల్లా వ్యవసాయ అధికారి ఎన్.వెంకటేశ్వర్లు, జిల్లా పంచాయితీ అధికారి కేశవరెడ్డి, డీటీసీ కరీం, ఐసీడీఎస్ పీడీ మనోరంజని, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎన్. ప్రభావతి తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

జిఎంసి స్పందనకు 38 అర్జీలు

ప్రజాశక్తి-గుంటూరు :జగనన్నకు చెబుదాం, స్పందనకు అందే ఫిర్యాదులను విభాగాధిపతులే నేరుగా పరిశిలించి పరిష్కరించాలని, ఏ ఒక్క ఫిర్యాదు పునరావతం కాకుండా శాశ్వత ప్రాతిపదికన పరిష్కారానికి కషి చేయాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ కాన్ఫరెన్స్ హాల్లో స్పందన నిర్వహించారు. కమిషనర్ తొలుత జగనన్నకు చెబుదాం, స్పందన పోర్టల్, ఈ.ఆర్.పి., వాట్స్ అప్, కాల్ సెంటర్ల ద్వారా అందిన ఫిర్యాదుల పై అధికారులతో, సంబందిత సిబ్బందితో సమీక్షించి ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ స్పందనలో పట్టణ ప్రణాళిక విభాగం 12, ఇంజినీరింగ్ విభాగం 15, రెవెన్యూ విభాగం 1, ప్రజారోగ్య విభాగం 4, ఉపాసెల్ విభాగం 2, అకౌంట్స్ విభాగం 1, ఎడ్యుకేషన్ 3 ఫిర్యాదులు, మొత్తం 38 ఫిర్యాదులు అందాయి. కార్యక్రమంలో అదనపు కమిషనర్ పి.రోజా, డిప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, టి.వెంకట కష్ణయ్య, ఉపాసెల్ పి.ఓ. రవీంద్ర, ఎస్.ఈ. భాస్కర్, సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, ఎంహెచ్ఓ డాక్టర్ భానుప్రకాష్, ఏడిహెచ్ రామారావు, బయాలజిస్ట్ మధుసూదన్, మేనేజర్ శివన్నారాయణ, ఉపా సెల్ సూపరిండెంట్ వెంకటేశ్వర్లు, డిప్యూటీ సిటి ప్లానర్లు పాల్గొన్నారు.

అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్

18న నాట్స్ ఆధ్వర్యంలో మెగా కంటి వైద్యశిబిరం

ప్రజాశక్తి - పెదనందిపాడు రూరల్

విద్యారంగంలో టెక్నాలజీ పెరిగి వచ్చిన మార్పులకు అనుగుణంగా విద్యాబోధనలో మార్పులు రావాలని, ఇందుకు ఉపాధ్యాయుల సహకారం ఎంతో అవసరం అని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు అన్నారు. సోమవారం సాయంత్రం పెదనందిపాడు లైన్స్ మాంటిసోరి సి.బి.ఎస్.ఇ పాఠశాలలో ఏర్పాటుచేసిన ప్రైమరీ ప్రీ ప్రైమరీ డిజిటల్ రూములను నాట్స్ అధ్యక్షులు బాపయ్య చౌదరి(బాపు) తో కలిసి ఎమ్మెల్సీ లక్ష్మణరావు ప్రారంభించారు. అనంతరం పాఠశాల పాలకవర్గ అధ్యక్షులు అరవపల్లి కృష్ణ అధ్యక్షతన సమావేశంలో వారు మాట్లాడారు. గ్రామీణ ప్రాంతంలో తక్కువ ఫీజులతో కార్పొరేట్ స్థాయి విద్యను అందిస్తున్న ఎల్ ఎం పాఠశాల పాలకవర్గాన్ని ఉపాధ్యాయులను లక్ష్మణరావు అభినందించారు. నాట్స్ అధ్యక్షులు బాపయ్య చౌదరి మాట్లాడుతూ మన దేశంలో గ్రామీణ ప్రాంత ప్రజల అభివద్ధికి కృషి చేయడమే తమ లక్ష్యం అన్నారు. ఈనెల 18వ తేదీ పెదనందిపాడు లో నాట్స్ ఆధ్వర్యంలో రెండో విడత ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. విద్యాభివృద్ధికి దాసరి శేషగిరిరావు చేస్తున్న కృషిని ప్రశంసించారు. అనంతరం తెలుగులో అత్యధిక మార్పులు సాధించిన వివిఎన్ వైష్ణవికి రూ. పదివేలు నగదు లక్ష్మణరావు ద్వారా అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల సెక్రటరీ కరెస్పాండెంట్ ముద్దన నగరాజకుమారి, బ్యాంక్ ఆఫ్ బరోడా మేనేజర్ రమణాచారి, ఎం రాఘవయ్య, వి విద్యాసాగర్ గుప్తా, డి ఎల్. ప్రసాద్, ప్రిన్సిపాల్ కిరణ్ జోష్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

మాట్లాడుతున్న నాట్స్ అధ్యక్షులు బాపు

క్రోసూరులో సిఎంకు ఘనస్వాగతం

సిఎం జగన్‌కు పల్నాడు జిల్లా క్రోసూరులో సోమవారం ఘనస్వాగతం లభించింది. క్రోసూరు హెలిప్యాడ్ నుంచి సభా స్థలి వరకు ఆయన బస్సులో వచ్చారు. దారిపొడవున ప్రజల ఆయనకు స్వాగతం పలికారు. రహదారుల వెంట ప్రజలు బారులుతీరారు. హెలిప్యాడ్ వద్ద మంత్రులు బొత్సా సత్యనారాయణ, కారుమూరి నాగేశ్వరరావు, అంబటిరాంబాబు, విడదల రజనీ, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్, విద్యాశాఖ కమిషనర్ సురేష్‌కుమార్, ఎంపిలు మోపిదేవి వెంకట రమణ, అయోధ్య రామిరెడ్డి, లావు శ్రీకృష్ణదేవరాయులు, ఎమ్మెల్సీలు చంద్రగిరి ఏసురత్నం,ఎల్.అప్పిరెడ్డి,తలశిల రఘురాం, జంగాకృష్ణమూర్తి, ఎమ్మెల్యేలు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, కాసు మహేష్ రెడ్డి, బొల్లా బ్రహ్మనాయుడు, గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి,జిల్లా కలెక్టర్ శివశంకర్, ఐజి పాలరాజ్, ఎస్‌పి రవిశంకర్ రెడ్డి స్వాగతం పలికిన వారిలో ఉన్నారు. (ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి, క్రోసూరు)

ముఖ్యమంత్రితో సెల్ఫీ దిగుతున్న విద్యార్థులు

విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు : జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఏర్పడుతుందని, విద్య ప్రాధాన్యతను గుర్తించి రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు చేపడుతున్నారని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక స్తంబాల గరువులోని నగరపాలక ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీ కార్యక్రమంలో కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి, గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరిధరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పల్నాడు జిల్లా, క్రోసూరు నుండి సిఎం పాల్గొన్న జెవికె పంపిణీ కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారం వీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పేదలకు మెరుగైన విద్యను అందించాలన్న ఉద్దేశంతో ప్రతి విద్యార్థికి ఉచితంగా నోట్ బుక్స్, టెక్స్ట్ బుక్స్, యూనిఫాంతోపాటు, కుట్టుకూలి, బూట్లు, సాక్సులు, బెల్టులు, స్కూల్ బ్యాగ్, డిక్షనరీ, నాడు-నేడు ద్వారా పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, విద్యాదీవెన, వసతి దీవెన, విదేశీ విద్యా పథకం వంటి అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. నాడు-నేడు ఫేజ్-1లో 308 స్కూళ్ళను రూ.69 కోట్లతో తీర్చిదిద్దడం జరిగిందని, ఫేజ్-2 క్రింద 561 స్కూళ్ళకు రూ.215.75 కోట్లు మంజూరు చేయడం జరిగిందన్నారు.ఇప్పటి వరకు రూ.46 కోట్లు ఖర్చు చేయడం జరిగిందన్నారు. మిగిలిన స్కూళ్ళకు 3వ ఫేజ్ క్రింద నాడు-నేడు పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. అలాగే డిజిటల్ విద్యను ప్రోత్సహించటానికి డిజిటల్ స్క్రీన్లు, 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు, రక్తహీనతను తగ్గించానికి పౌష్టికాహార అందిస్తున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ మాట్లాడుతూ అక్షరాస్యతలో 2019లో దేశంలోని రాష్ట్రాలలో మన రాష్ట్రం క్రింది నుండి3వ స్థానంలో ఉందని, దీనిని గమనించిన ముఖ్యమంత్రి అక్షరాస్యతను పెంచేందుకు విప్లవాత్మకమైన మార్పులు చేపట్టారన్నారు. అమ్మ ఒడి ద్వారా ప్రతి ఏటా రూ.15 వేలు నేరుగా తల్లుల ఖాతల్లో జమ చేయడం జరుగుతున్నదన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి పి.శైలజ, సమగ్ర శిక్ష ఏపిసి విజయలక్ష్మి మాట్లాడుతూ ఈ ఏడాది 1095 పాఠశాలల్లో 1, 16,430 మందికి జెవికె కిట్లు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం విద్యార్థులకు కిట్లు అందచేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఈఓ వెంకటేశ్వర్లు, జిఎంసి ఎస్ఈ భాస్కర్, తహశీల్దార్ సాంబశివరావు, ఉర్దూ డిఐ ఖాసిం, ఎంఇఓ బలరాం నాయక్, కార్పొరేటర్ శ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సభలో మాట్లాడుతున్న విద్యార్థిని

కిట్లు అందచేస్తున్న కలెక్టర్, ఎంఎల్ఎ తదితరుల